ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 8 నవంబరు 2024



చల్లపల్లిలో రోడ్డు శుభ్రం చేస్తున్న స్వచ్ఛ సారథులు ప్రసాద్, పద్మావతి తదితరులు

పచ్చని స్వచ్ఛ చల్లపల్లి

స్ఫూర్తివంతమైన స్వచ్ఛసేవా ఉద్యమానికి పదేళ్లు

- దేశస్థాయిలో గుర్తింపు.. ఎల్లలు దాటిన స్వచ్ఛస్ఫూర్తి
- కార్యకర్తల నిస్వార్థ సేవానిరతి
- డీఆర్కే దంపతుల సేవాభావం స్ఫూర్తిదాయకం
- పదేళ్ల వేడుక 'స్వచ్ఛ చల్లపల్లి' సిద్ధం

గాంధీజీ కలలుగన్న స్వచ్ఛభారత్ ఆశయాన్ని ఆచరణలో చూపుతున్న గ్రామం చల్లపల్లి. ఆయన స్ఫూర్తితో 2014లో ప్రధాని నరేంద్ర మోదీ భారతీయులకిచ్చిన స్వచ్ఛభారత్ నినాదాన్ని అందుకుని చీపురు పట్టుకున్న చేతులు పదేళ్లుగా శ్రమిస్తూనే ఉన్నాయి. స్వచ్ఛత, పరిశుభ్రత లక్ష్యాలుగా ప్రజలకు ప్రాణం పోసే వైద్య దంపతులు డీఆర్కే ప్రసాద్, పద్మావతి చీపుర్లు చేతబట్టి నిరంతరం శ్రమిస్తున్న వైనం ఎందరికో స్ఫూర్తిదాయకం. దేశస్థాయిలో గుర్తింపు.. ఎల్లలు దాటిన స్వచ్ఛస్ఫూర్తి.. కార్యకర్తల నిస్వార్థ సేవానిరతి కలిగిన 'స్వచ్ఛ చల్లపల్లి' పదేళ్ల వేడుకకు సిద్ధమైన వేళ ప్రత్యేక కథనం. 8లో

ఉలిక్కిపడిన యనమలకుదురు

రెండు గ్రూపుల మధ్య కొట్లాటతో కలకలం

- కర్రలు, చాకులు, బీరుబాటిళ్లతో పరస్పరం దాడులు
- ఇద్దరికి గాయాలు, ఆస్పత్రిలో చేరిక
- ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు



గొడవలో స్పృహకోల్పోయిన యువకుడు

పెనమలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు శివాలయం కొండ వెనుక ఉన్న పెట్రోలు బంకు వద్ద మంగళవారం అర్ధరాత్రి రెండు గ్రూపుల మధ్య జరిగిన కొట్లాట గ్యాంగ్‌వార్‌ను తలపించింది. కత్తులు, కర్రలు, బీరుబాటిళ్లతో పరస్పరం దాడులకు దిగడంతో యనమలకుదురు గ్రామం ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే... యనమలకుదురుకు చెందిన గుడివాక రాహుల్, తాడిగడపకు చెందిన పెదపూడి మనోజ్‌కుమార్ మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో రెండు గ్రూపులు మంగళవారం రాత్రి కొట్టుకున్నాయి. మనోజ్‌ను కింద పడేసి కత్తులతో పొడిచారు. సంతోష్‌పై కర్రలు, బీరుబాటిళ్లతో దాడి చేశారు. పెదపూడి మనోజ్ అలియాస్ టోనీ, గుడివాక రాహుల్ వెంకటసాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొట్లాటలో టోనీ, రాహుల్ వెంకటసాయిలతో పాటు కిరణ్ అలియాస్ గనీ, సంతోష్‌చందు, భాగ్యరాజ్, దినేష్ అలియాస్ పండు, సతీష్, విన్ను, ప్రేమ్, బుడియ్య, దర్శి వెంకటసాయికుమార్, జగదీష్, రవితేజ, ఉప్పెర్ల సాయికుమార్ మరి కొంతమంది ఈ గ్యాంగ్‌వార్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తొమ్మిది మందిని రిమాండ్‌కు పంపగా, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గతేడాది యనమలకుదురు డొంక రోడ్డులో యువకుల మధ్య జరిగిన గొడవ రఫీ హత్యకు దారి తీసిన సంగతి తెలిసిందే.

నీటి తీరువా వసూళ్లలో గందరగోళం



జిల్లాలో నీటి తీరువా వసూళ్లలో తీవ్ర గందరగోళం నెలకొంది. వీఆర్వోల పర్యవేక్షణలో జరిగే ఈ ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందట గ్రామ సచివాలయాలకు అప్పగించడంతో అరెకరం భూమికి ఏడాదికి రూ.100 చెల్లించే రైతు సర్వీస్ చార్జీ రూపంలో మరో రూ.35 కలిపి రూ.135 కట్టాల్సి వస్తోంది. చెల్లించడంలో ఆలస్యమైతే రైతులు కట్టాల్సిన నగదుకు 6శాతం వడ్డీవేసి సచివాలయాల్లో వసూలు చేస్తున్నారు. అసైన్డ్ భూములకు నీటితీరువా వసూలు చేయకపోవడంతో బ్యాంకుల నుంచి పంట రుణాలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో వీఆర్వోల ద్వారా వసూలు

వైసీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాలకు బాధ్యతలు

- అరెకరానికి చెల్లించాల్సింది రూ.100
- సర్వీసు చార్జీ పేరుతో మరో రూ.35 వడ్డన
- చెల్లింపు ఆలస్యమైతే 6శాతం వడ్డీభారం
- అసైన్డ్ భూములకు నిలిపేయడంతో ఆగిన బ్యాంకు రుణాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ప్రతిఏటా జూన్‌ప్రారంభం నుంచి మరుసటి ఏడాది జూలై నెలాఖరు వరకు ఏడాది పాటు నీటి తీరువా వసూలును ఒక ఫసలీగా లెక్కిస్తారు. ప్రస్తుతం 1432వ ఫసలీ నడుస్తోంది. వరి సాగుకు ఏడాదిలో రెండు పంటలకు సాగునీరు విడుదల చేస్తే ఎకరానికి రూ. 350 నీటి తీరువాగా వసూలు చేస్తారు. ఖరీఫ్ పంటకు మాత్రమే సాగు నీరు ఇస్తే ఎకరానికి రూ.200 వసూలు చేయాల్సి ఉంది. చేపల చెరువులకు ఏడాదికి ఎకరానికి రూ.500 వసూలు చేస్తారు. జిల్లాలో 1,77,688 నీటితీరువా ఖాతాలున్నాయి. 1431వ ఫసలీకి సంబంధించి నీటితీరువాగా రూ.9.87కోట్లు వసూలు చేయాల్సి ఉంది. 1431, 1432 ఫసలీలకు సంబంధించి రూ.12.81కోట్లు వసూలు కావాల్సి ఉంది.

రికార్డుల్లో ఉన్నంత వరకే..

ప్రస్తుతం సచివాలయాల ద్వారా వసూలు చేస్తున్న నీటి తీరువాలో పలు ఇబ్బందులున్నాయి. రైతుకు నాలుగు ఎకరాల భూమి ఉంటే సాంకేతిక తప్పిదాల కారణంగా మూడు ఎకరాలు మాత్రమే అడంగల్‌లో చూపుతోంది. నీటి తీరువా చెల్లించే సమయంలో ఈ మూడు ఎకరాలకే కట్టించుకుంటున్నారు. దీంతో ఎకరం భూమి తనపేరున ఉన్నా ఆన్‌లైన్‌లో కనపడకపోవడంతో నీటి తీరువా చెల్లించేందుకు రైతులకు అవకాశం లేనిస్థితి.

అసైన్డ్ భూములకు నీటితీరువా వసూలు నిలిపివేత

జిల్లాలోని మచిలీపట్నం, పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి, నాగాయలంక, కోడూరు, నందివాడ మండలాల్లో అసైన్డ్ భూములు అధికంగా ఉన్నాయి. అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, పోరంబోకు, డ్రెయినేజీ భూములకు గతంలో వీఆర్వోలు నీటితీరువా వసూలు చేసేవారు. రసీదులు కూడా ఇచ్చేవారు. ప్రస్తుతం పట్టా భూములు, అదికూడా అడంగల్ నమోదై ఉన్న భూములకు మినహా ఇతర కేటగిరీలలో ఉన్న భూములకు నీటితీరువా వసూలును రెండేళ్లుగా నిలిపివేశారు. నీటితీరువా ప్రతిఏటా కడితే భూమి తమదేననే ధైర్యం రైతులకు ఉంటుంది. అసైన్డ్, ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న చిన్నపాటి రైతుల నుంచి నీటితీరువా కట్టించుకోకపోవడంతో పీఏసీఎస్‌లు, వాణిజ్య బ్యాంకులలో రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదు. దీంతో రైతులు వ్యవసాయం కోసం స్థానిక వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. రైతుల ఇబ్బందులను గుర్తించి కూటమి ప్రభుత్వం అసైన్డ్‌భూములకు నీటితీరువా కట్టించుకునేలా చర్యలు తీసుకోవాలని తీరప్రాంత రైతులు కోరుతున్నారు.



నీటి తీరువా ఆపేసిన అసైన్డ్ భూములు

నీటితీరువా వసూలును బట్టి కాలువల నిర్వహణ పనులు

రైతులు చెల్లించిన నీటితీరువాను బట్టి జిల్లాలోని సాగునీటి కాలువలు, డ్రెయినేజీలలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం)పనులు చేస్తారు. నీటితీరువా రూపంలో వసూలైన మొత్తంలో 80శాతం నిధులను నీటిపారుదలశాఖకు కేటాయిస్తారు. ఈ నగదుతో కాలువల నిర్వహణ పనులను చేయాల్సి ఉంది. నీటి తీరువా సక్రమంగా వసూలు కాకపోవడంతో ఈ ఏడాది ప్రధాన పంట కాలువలు, డ్రెయిన్‌లలో ఓఅండ్ఎం పనులకుగాను కృష్ణాడెల్టాకు కేవలం రూ.27 కోట్లను మాత్రమే కేటాయించారు. అదికూడా తూడు, గుర్రపు డెక్కలను తొలగించే పనులు మాత్రమే చేయాలని నిర్ణయించారు. రెండేళ్ల క్రితం కాలువల నిర్వహణ పనులకు రూ.57 కోట్ల వరకు విడుదల చేయగా, ఈ ఏడాది ఈ పనులకు సంబంధించి నిధుల విడుదలలో రూ30కోట్లకు కోతపెట్టారు.

టీడీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని పామర్రు నియోజకవర్గంలో పోలీసులు వేధింపులకు దిగుతున్నారు. ఎప్పుడో 2020లో నమోదైన కేసును బూచిగా చూపుతూ రౌడీషీట్ తెరుస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినా మాకీ వేధింపులు ఏమిటంటూ తెలుగు తమ్ముళ్లు గగ్గోలు పెడుతున్నారు.



తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద అనుచరులతో చెన్నుపాటి శ్రీధర్

లోకేశ్ కోసం ధర్నా చేశావ్! నీపై రౌడీషీట్ తెరుస్తాం

2020 నాటి కేసును తిరగదోడి బెదిరింపులు

- టీడీపీ నాయకులకు పోలీసుమార్కు వేధింపులు
- పామర్రు నియోజకవర్గంలో చిత్రమైన పరిస్థితి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : రాజధాని రైతుల ఆందోళన సమయంలో వారికి మద్దతుగా విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు 24 గంటలపాటు నిరాహార దీక్ష చేశారు. ఆయనకు మద్దతుగా ఆ దీక్షలో పాల్గొన్న నారా లోకేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తోట్లవల్లూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి నిర్బంధించారు. పోలీసుల వైఖరికి నిరసనగా అప్పట్లో తోట్లవల్లూరు మండల టీడీపీ నాయకులు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎ1గా టీడీపీ బీసీ నాయకుడు వి.గురుమూర్తిని, ఏ2గా వల్లూరుపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు చెన్నుపాటి శ్రీధర్‌ను పెట్టారు. వీరితోపాటు పలువురు టీడీపీ నాయకులు కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. అలాగే 2023లో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళన చేసినందుకు గాను గురుమూర్తి, చెన్నుపాటి శ్రీధర్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులను తిరగదోడిన తోట్లవల్లూరు పోలీసులు టీడీపీ నాయకులను వేధింపులకు గురి చేయడం ప్రారంభించారు. తోట్లవల్లూరు ఎస్‌ఐ అర్జునరాజు బుధవారం వల్లూరుపాలెం టీడీపీ నాయకుడు చెన్నుపాటి శ్రీధర్ ఇంటికి ఇద్దరు కానిస్టేబుళ్లను పంపి శ్రీధర్‌ను స్టేషన్‌కు తీసుకురావాల్సిందిగా ఆదేశించారు. స్టేషన్‌కు వెళ్లిన శ్రీధర్‌ను రోజంతా కూర్చోబెట్టి తిరిగి గురువారం స్టేషన్‌కు రావాలంటూ పంపేశారు. గురువారం ఉదయం స్టేషన్‌కు వెళ్లిన శ్రీధర్‌ను వేలిముద్రలు, ఫొటోలు ఇవ్వాలంటూ కోరడంతో ఆయన తనపై ఏ కేసు ఉంది... ఎందుకు ఇవ్వాలంటూ ప్రశ్నించడంతో ఎస్‌ఐ ఆగ్రహంతో ఊగిపోతూ.. ఎక్కువ మాట్లాడితే బొక్కలో తోస్తా.. రౌడీ షీట్ తెరుస్తా అంటూ బూతులు తిట్టడం మొదలుపెట్టారని తెలిసింది. 'నీ పార్టీ నాయకులే నీపై కేసులు పెట్టి లోపలేయమంటు న్నారు. నాకు పైఅధికారుల నుంచి ఒత్తిడి ఉంది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తనపై ఉన్న కేసు వివరాలు ఏమిటతో చెబితే కానీ తాను వేలిముద్రలు ఇవ్వనని శ్రీధర్ అడ్డం తిరగడంతో చేసేది లేక ఆయన్ను మిగతా 6లో..



పెడనలో విద్యుత్ స్విచ్చింగ్ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ, పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు పాల్గొన్నారు.

అందుబాటులోకి వీఆర్ వంతెన
6లో

జిల్లాలో 70వేల ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ
6లో

నేడు మచిలీపట్నానికి వైఎస్ షర్మిల రాక
6లో

ఖర్చు కాస్త ఎక్కువే!

కృష్ణాతీరంలో రేపు సీ ప్లేన్ ట్రయల్ రన్!

- పర్యాటక రంగానికి కొత్త మలుపు
- విజయవాడ - శ్రీశైలం ట్రిప్పుకు రూ.2 లక్షల వరకు ఖర్చు
- టికెట్ ధర రూ.15 వేలు ఆపైన ఉంటేనే..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నీటిపై తేలియాడుతూ ఆకాశంలోకి దూసుకుపోయే సీ ప్లేన్ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై ఈ నెల 9న విజయవాడలో కృష్ణానదీ తీరాన పున్నమిఘాట్ దగ్గర ట్రయల్ రన్ నిర్వహించబోతున్నారు. ఈ ట్రయల్ రన్ అనేది ల్యాండింగ్, టేకాఫ్‌లను పరిశీలించటమే కాదు దీని వయబిలిటీ ఎంత అనేది కూడా అంతర్లీనంగా తేలనుంది. అభివృద్ధి చెందిన దేశాలలో పర్యాటక రంగాన్ని కొత్త మలుపు తిప్పుతున్న సీ ప్లేన్‌లు మనకు రావటం అన్నది ఆహ్వానించదగ్గ పరిణామం. అక్కడ ఖర్చు మిగతా 6లో..



వీహెచ్‌పీ కార్యనిర్వాహక కార్యదర్శి మిలింద్ పరాండేకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న పుట్టగుంట సతీశ్

దేవాలయాల పరిరక్షణకు కృషి

» వీహెచ్‌పీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మిలింద్ పరాండే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

'దేశంలో దేవాలయాలు, హిందూ ధర్మ పరిరక్షణకు విశ్వ హిందూ పరిషత్ కృషి చేస్తోంది. దేవాలయాల నిర్మాణం, నిర్వహణలో ప్రభుత్వాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది.' అని వీహెచ్‌పీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మిలింద్ పరాండే అన్నారు. గురువారం విజయవాడలోని ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీశ్‌కుమార్ నివాసానికి మాజీ ఎంపీ, వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజుతో కలిసి ఆయన విచ్చేశారు. గంటసేపు సతీశ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. రెండు దశాబ్దాలుగా సతీశ్ చేస్తున్న సేవల్ని తెలుసుకుని, ప్రత్యక్షంగా కలవాలని వచ్చానని మిలింద్ తెలిపారు. పుట్టగుంట లాంటి సేవాతత్పరులు హిందూ ధర్మపరిరక్షణలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. విజయవాడలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులతో సమావేశమయ్యేందుకు వచ్చిన మిలింద్ పరాండే, పుట్టగుంట నివాసానికి రావడం.. గంటపాటు భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. మిలింద్ వెంట వీహెచ్‌పీ ముఖ్యులు శ్రీనివాసరెడ్డి, నవీన్, కోనేరు దుర్గాప్రసాద్ ఉన్నారు.



మొవ్వ అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

రూ.250 కోట్లతో ఫైర్‌స్టేషన్ల ఆధునికీకరణ

» అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాసరెడ్డి

కూచిపూడి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులు రూ.250 కోట్లతో అగ్నిమాపక కేంద్రాలను ఆధునీకరిస్తామని ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇందులో 75 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఆయన పేర్కొన్నారు. మొవ్వ అగ్నిమాపక కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. అగ్నిమాపక వాహనాన్ని, అగ్ని ప్రమాద సమయాల్లో వినియోగించే పరికరాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అగ్నిమాపక కేంద్రాల్లో సమస్యలను పరిశీలించి, పరిష్కరించేందుకు అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. 100 అగ్నిమాపక యంత్రాలు కొనుగోలు, 17 నూతన అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. హైకోర్టు, సచివాలయాల వద్ద, రాజమండ్రి రూరల్‌లో ఒక్కొక్కటి, విశాఖపట్నంలో ఆరు, భోగాపురం విమానాశ్రయం వద్ద, ప్రకాశం జిల్లాలో ఏడు కేంద్రాల ఏర్పాటుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సత్తెనపల్లి వద్ద అడ్వాన్స్ రిస్క్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా రూ.4.5 కోట్లతో అత్యాధునిక హంగులు గల వాహనాన్ని కొనుగోలు చేసి భారీ ప్రమాదాలు అరికడతామన్నారు. పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు అదుపులోకి తీసుకురావటానికి 25 మంది సిబ్బందికి గుజరాత్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. భారీ అగ్ని ప్రమాదాల సమయంలో సమాచారం సత్వరం చేరేందుకు విజయవాడలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఫైర్ అధికారి జి.ఏసురత్నం, మొవ్వ ఫైర్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 70వేల ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

» కృష్ణా జేసీ గీతాంజలిశర్మ



మచిలీపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు కృష్ణా జిల్లాలో 70వేల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించామని జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. జేసీ చాంబరులో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.30 లక్షల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారని, 70 వేల సిలిండర్లను అందించామని ఆమె తెలిపారు. వినియోగదారులకు ఏ ఇబ్బందులు ఎదురైనా టోల్‌ఫ్రీ నెంబరు 1967కు కాల్‌చేయాలని ఆమె సూచించారు. ఏడాదికి మూడు సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, మొదటి సిలిండర్‌ను పొందేందుకు మార్చి 31వ తేదీ వరకు సమయం ఉందని ఆమె తెలిపారు. రెండో సిలిండర్‌ను ఏప్రిల్ నుంచి జూలై వరకు, మూడో సిలిండర్‌ను ఆగస్టు నుంచి డిసెంబరు వరకు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఉచిత గ్యాస్‌సిలిండర్ కోసం బుక్‌చేసుకున్నవారు ముందుగా నగదు చెల్లించాలని తెలిపారు. సిలిండర్ అందిన 48గంటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీ నగదు వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. బ్యాంకు ఖాతాలకు, ఆధార్‌కార్డుకు ఈకేవైసీ చేయించకపోతే వినియోగదారుల ఇంటివద్దకే గ్యాస్‌డీలర్ల ప్రతినిధులు వచ్చి ఈకేవైసీ చేయాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. డీఎస్వో పార్వతి పాల్గొన్నారు.



డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బైరా రామకోటేశ్వరరావు

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా

బైరా రామకోటేశ్వరరావు

విజయవాడ లీగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా బైరా రామకోటేశ్వరరావు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయంలో ఆయన ఉదయం 11 గంటలకు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వి.రాజేంద్రప్రసాద్, ఎం.విజయ, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లాం అజోయ్ ప్రేమ్‌కుమార్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. తనను డీవోపీగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత, ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్‌కు బైరా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రాసిక్యూటర్లందరూ బాధితులకు న్యాయం జరిగే విధంగా పనిచేయాలని, నిందితులకు కఠిన శిక్షలు పడేలా ప్రాసిక్యూటర్ వ్యవస్థను పటిష్ఠ పరచాలని తెలిపారు. బైరాను న్యాయవాది కళ్లే నాగేశ్వరరావు, ముప్పూరి హరీష్, న్యాయవాదులు, ప్రాసిక్యూషన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు, రాజకీయ నాయకులు అభినందించారు.

బందరు రోడ్డుపై ట్రాఫిక్‌ను తప్పించుకుని వెళ్లాలనే విజయవాడ ప్రజల ఐదున్నరేళ్ల నిరీక్షణకు తెరపడుతోంది. పంట కాల్వరోడ్డుపై వీఆర్ సిద్దార్థ కళాశాల వంతెన పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. వంతెనపై బీటీ రోడ్డు నిర్మాణం గురువారంతో పూర్తయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూనుకుని వంతెనపై వీఆర్ సిద్దార్థ కళాశాల విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రూ.లక్షల వ్యయంతో సౌండ్ బ్యారియర్స్ ఏర్పాటు చేయడం, వంతెన కింద లక్షల వ్యయంతో క్లోజ్డ్ డ్రెయిన్ నిర్మించి, చివరగా కళాశాల యాజమాన్యంతో బీటీ రోడ్డు నిర్మింపజేసి వంతెనను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడం అభినందనీయమని స్థానికులు అంటున్నారు. ఈ ఘనత ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కూటమి ప్రభుత్వానిదే నని అంటున్నారు.



అందుబాటులోకి..

వీఆర్ సిద్దార్థ కళాశాల వంతెనపై పూర్తయిన బీటీ రోడ్డు

వీఆర్ వంతెన

పంటకాల్వ రోడ్డులో వంతెనపై బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి ● బందరు రోడ్డుపై తగ్గనున్న ట్రాఫిక్

(ఆంధ్రజ్యోతి-పెనమలూరు)

విజయవాడ బందరు రోడ్డుపై రద్దీని తగ్గించేందుకు 2018లో సీఆర్డీయే ఆధ్వర్యంలో వీఆర్ సిద్ధార్థ కళాశాల వద్ద వంతెన నిర్మాణం చేపట్టారు. సిద్ధార్థ అకాడమీతో కలిసి సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవతో ఒప్పందం చేసుకున్నారు. రూ.11 కోట్లతో పైవంతెన నిర్మాణం బాధ్యతను అకాడమీకి అప్పగించారు. పైవంతెనపై శబ్ద కాలుష్య నివారణకు సౌండ్ బ్యారియర్స్ ఏర్పాటు, కింద నుంచి డ్రైనేజీ కాల్వ నిర్మాణం సీఆర్డీయే ఆధ్వర్యంలో చేపట్టాలనేది ఒప్పందం. అనుకున్నట్లుగానే ఏడాదిలోనే అకాడమీవారు సొంత నిధులతో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. కానీ 2019లో వైసీపీ ప్రభుత్వం రాకతో సీను రివర్సైంది. సీఆర్డీయే పనులు నిలిచిపోయాయి. కేవలం పదిశాతమే మిగిలి ఉన్న పనులు నిధుల లేమితో అధికారులు ఆపివేశారు. దీంతో వంతెన పూర్తయినా దానిపై రోడ్డు నిర్మాణం జరగలేదు. దీంతో వాహనదారులకు అందుబాటులోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే నాలుగు వందల మీటర్ల పొడవైన వంతెనపై కోటి రూపాయల ఖర్చుతో సౌండ్ బ్యారియర్స్, వంతెన కింద భాగం నుంచి ఎనిమిది వందల మీటర్ల పొడవైన డ్రెయినేజీ కాల్వ నిర్మాణం చేపట్టారు. సిద్ధార్థ అకాడమీ సొంత నిధులతో బుధ, గురువారాల్లో వంతెనపై భాగంలో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసింది. దీంతో వంతెన పంటకాల్వ రోడ్డుపై ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది.


ఎవరెవరికి ఉపయోగమంటే..

ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో బందరు, ఉయ్యూరు, కంకిపాడు, ఏలూరు రోడ్డు వైపు నుంచి వచ్చే ప్రయాణికులు బందరు రోడ్డుకు సమాంతరంగా ఉన్న పంటకాల్వ రోడ్డుపై సులువుగా వెళ్లొచ్చు. విజయవాడ వైపు నుంచి ఎనికేపాడు, ఏలూరు రోడ్డు, ఉయ్యూరు, కంకిపాడు బందరు వైపు వెళ్లే ప్రయాణికులు పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చీలి పంటకాల్వ రోడ్డుద్వారా సిద్ధార్థ వంతెన పైనుంచి వెళ్లొచ్చు. పంటకాల్వ రోడ్డు నుంచి ఆయా మార్గాల ప్రజలు రాకపోకలు సాగించడం ద్వారా బందరు రోడ్డుపై చాలా వరకు రద్దీ తగ్గుతుంది.

ఇప్పటికి సాకారమవుతోంది

ఆరేళ్లుగా వంతెన పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక, పనులు పూర్తయ్యాయి. వంతెన అందుబాటులోకి రావడంతో రద్దీ లేకుండా ప్రయాణించొచ్చు. ఎన్నో ఏళ్లుగా వంతెనపై ప్రయాణించాలన్న కల ఇప్పటికి సాకారమవుతోంది.

\- వెలగపూడి శంకరబాబు, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు





ప్రభుత్వాస్పత్రిలో ఎంఆర్‌ఐ మిషన్

మొరాయిస్తున్న ఎంఆర్‌ఐ మిషన్లు

(ఆంధ్రజ్యోతి-ప్రభుత్వాసుపత్రి): సర్వజనాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాల మాట దేవుడెరుగు కనీస వైద్య సౌకర్యాలు అందడం లేదని ఈమధ్య కాలంలో తరచూ వినిపిస్తోంది. నిత్యం వేలాది రోగులు విజయవాడలో ఉన్న అతి పెద్ద ప్రభుత్వ వైద్యశాలకు వైద్యం నిమిత్తం వస్తూ ఉంటారు. 1,657 పడకలు ఉన్న వైద్యశాలలో వైద్య సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండటంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కానింగ్ మిషన్లు పదే పదే మొరాయించడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గంటలసేపు క్యూ లైన్‌లో నిలబడలేక రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం వచ్చి ఓపీ రాయించుకుని సంబంధిత వైద్యుల వద్దకు వెళ్లేందుకే గంటల సమయం వృథాగా పోతోందని, తీరా ఎంఆర్‌ఐ స్కానింగ్‌కు వెళితే అక్కడ గంటల సమయం వృథాగా పోతోందని అంటున్నారు. పదేపదే అవి మొరాయించడంతో ఇంకా ఇబ్బంది పడుతున్నామని రోగులు వాపోతున్నారు. రోజుకు కేవలం 40 మందికే స్కానింగ్ తీస్తున్నామని ఒక్కొక్క రోగికి 45 నిమిషాలు పడుతోందని టెక్నీషియన్స్ చెబుతున్నారు. అధికారులు స్పందించి, కండిషన్‌లో ఉన్న ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రాలు ఉంచాలని, మరో రెండు కొత్తవి ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

జోగి రమేశ్..గొంగలి పురుగులాంటోడు

» పెడనలో ఆయన నిర్వాకాలు వెల్లడి చేస్తాం

» ఎన్టీటీపీఎస్ బూడిదను కౌంటర్ పెట్టి అమ్మిన దౌర్భాగ్యులు జోగి ముఠా

» మిన్నకున్నామని దిగజారి ప్రవర్తిస్తే సహించం

» ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ హెచ్చరిక

మైలవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి, వైసీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేశ్.. గొంగలి పురుగులాంటోడు. వైసీపీలో చేరక ముందు ఇలాంటి కొడుకును ఎలా కన్నావమ్మా అని జగన్‌ను ఉద్దేశించి వైఎస్ విజయమ్మను ఆయన ప్రశ్నించాడు. ఆ విషయం జోగి మర్చిపోయినా ప్రజల మర్చిపోలేదు. జోగి గురించి ఎవరు మాట్లాడినా వారి స్థాయి తగ్గించుకున్నట్టే.' అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ విమర్శించారు. బుధవారం వైసీపీ ఆత్మీయ సమావేశంలో తనపై జోగి చేసిన విమర్శలకు గురువారం ఆయన స్పందించారు. జోగి బాగోతం గురించి పెడనలో ఆయన చేసిన నిర్వాకాల గురించి రేపట్నుంచి సోషల్ మీడియాలో బాధితుల ద్వారా నిజాలు వెల్లడి చేస్తామన్నారు. ఎన్టీటీపీఎస్ బూడిదను కౌంటర్ పెట్టి అమ్మిన దౌర్భాగ్యులు జోగి ముఠా అన్నారు. 2019లో సీటు త్యాగం చేసి పెడన వెళ్లాడో లేక అమ్ముకొని వెళ్లాడో ప్రజలందరికీ తెలుసునన్నారు. నీ ఎదుగుదలకు నారు, నీరు పోసిన సొంత బాబాయ్ వద్ద ఇండస్ట్రీశాఖ నుంచి నిధులు ఇప్పించి లంచం తీసుకున్నావా లేదా అని జోగిని ప్రశ్నించారు. సొంత బాబాయ్‌కి అప్పు ఉండి దొంగ భూములు కట్టబెట్టిన చరిత్ర జోగిదన్నారు. వైసీపీ నాయకుల వద్ద బిల్లుల ఇప్పించేందుకు జోగి లంచం కింద 20 నుంచి 30 శాతం కమీషన్ రూపంలో తీసుకున్నారని ఆధారాలతో సహా నిరూపిస్తానన్నారు. వరదల్లో ప్రజలు అల్లాడుతుంటే వీసమెత్తు మానవత్వం చూపని జోగి నేనున్నా ఆదుకుంటా అని క్యాడర్‌కు అబద్ధాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2018, 19కి ముందు ఆయనకున్న వాహనాలు ఎన్నో నివసించిన ఇల్లు ఏదో ఇప్పుడు ఉంటున్న ఇల్లు ఎక్కడి నుంచి వచ్చిన సొమ్ముతో కట్టాడో జిల్లాలోనే అత్యంత ధనికుడిగా జోగి ఎలా మారాడో ప్రజలు గమనిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఆస్తులను ఏ డబ్బులతో కొన్నాడో చెప్పాలన్నారు. మర్యాద, గౌరవం కాపాడుకోవాలంటే అది ఆయన చేతల్లోనే ఉందని ప్రజాస్వామ్యబద్ధంగా మిన్నకున్నామని గీత దాటి దిగజారి ప్రవర్తిస్తే సహించేది లేదని జోగిని హెచ్చరించారు.

ట్రాక్టర్ ఇసుకకు రూ.500లే వసూలు చేయమన్నా

» తహసీల్దార్ కుసుమకుమారి వివరణ

తోట్లవల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో నడుస్తున్న ఉచిత ఇసుక క్వారీల్లో ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.500 మాత్రమే వసూలు చేయాలని చెప్పానని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి వివరణ ఇచ్చారు. గురువారం 'దోచుకున్నోడికి దోచుకున్నంత' శీర్షికన వచ్చిన వార్తా కథనంపై ఆమె స్పందించారు. క్వారీలను మూతవేస్తే ఇసుక దొరకటం లేదంటున్నారని, క్వారీలు నడవనిస్తే నిందలు వేస్తున్నారని, తాను క్వారీల్లో ఎవ్వరి నుంచి రూపాయి కూడా తీసుకోలేదని తెలిపారు. అధికారులకు లంచాలపై బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయని తెలపగా అలాంటి వారిని తనవద్దకు తీసుకు రావాలని వాదన చేశారు. జీవో ప్రకారం ఇసుక క్వారీలపై తాము జోక్యం చేసుకోలేమని చెప్పిన తహసీల్దార్ గురువారం రూ.500 వసూలు చేయాలని ఆదేశించామని చెప్పటం విడ్డూరంగా ఉంది. క్వారీల్లో రూ.1000 చొప్పున వసూలు చేస్తుంటే తమకు సంబంధం లేదంటే అధిక దోపిడీని ఇంకెవరు అరికడతారో తెలియకుండా ఉంది.

లోకేశ్ కోసం ధర్నా చేశావ్!

నీపై రౌడీషీట్ తెరుస్తాం

(5వ పేజీ తరువాయి)

పంపేశారు. శ్రీధర్ తరహాలోనే పామర్రు నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులకు పోలీసుల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఏం చేస్తున్నట్టు..!

నియోజకవర్గంలో టీడీపీ నాయకులపై పోలీసులు పెట్టే కేసులు.. పాత కేసుల పేరుతో వేధిస్తుంటే పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఏం చేస్తున్నారంటూ టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో కొందరు నాయకుల చెప్పుడు మాటలు విని పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఎమ్మెల్యే ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. తోట్లవల్లూరు పోలీసుస్టేషన్ వద్ద వల్లూరుపాలెం టీడీపీ నాయకులు చెన్నుపాటి శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ.. తమ మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం వల్లే తాము ఇబ్బందులు పడుతున్నామని, చివరికి తమపై పోలీసులతో తప్పుడు కేసులు బనాయించే స్థితికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినేతలు చంద్రబాబు, లోకేశ్ కోసం ధర్నాలు చేయడమేనా తాము చేసిన తప్పు అని ఆయన ప్రశ్నించారు. పార్టీ కోసం ఎలాంటి కార్యక్రమాలు చేయని వారు ఇప్పుడు ఎమ్మెల్యే పక్కన చేరి పెత్తనం చలాయిస్తున్నారని వాపోయారు.

మర్యాదపూర్వకంగా..

» ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్



మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ గురువారం గురునానక్ కాలనీలోని కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి చిన్ని దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందించి సత్కరించారు. అనంతరం రాజకీయ పరిస్థితులపై పలు అంశాలను చర్చించారు. టీడీ పీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పాల్గొన్నారు.

ఖర్చు కాస్త ఎక్కువే!

(5వ పేజీ తరువాయి)

పెట్టగల స్థాయిని దృష్టిలో పెట్టుకుని చూసినా సీ ప్లేన్ కాన్సెప్ట్ ఎంతో విజయవంతంగా నడుస్తున్నాయి. మన దేశం విషయానికి వచ్చే సరికి ఈ ప్రాజెక్టులు చాలా వరకు విఫలమవుతున్నాయి. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు ప్రయోగాత్మకంగా నడపబోతున్న సీ ప్లేన్ వల్ల వయబిలిటీ కోణం అన్నది చాలా ముఖ్యంగా మారుతోంది. ప్రధానంగా మన దగ్గర వడోదరలో పదేళ్ల కిందట ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. తర్వాత క్రమంలో అది మూత పడింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం దగ్గర కూడా ఇలాంటి ప్రాజెక్టును తీసుకువచ్చారు. అది కూడా ఆగిపోయింది. ముంబాయిలో ఎంతో ఘనంగా ప్రారంభించిన సీ ప్లేన్ ప్రాజెక్టు కూడా మూత పడింది. దక్షిణ భారత దేశంలో మొదటి సారిగా కేరళలో ప్రవేశపెట్టిన సీ ప్లేన్ ప్రాజెక్టుకు కూడా అటకెక్కింది. సీ ప్లేన్ ప్రాజెక్టులు మూతపడటం వెనుకున్న కారణాలను పరిశీలిస్తే.. వయబిలిటీ కాకపోవటమే సమస్యగా మారుతోంది.

భారీగా నిర్వహణ వ్యయం

సీప్లేన్‌కు నిర్వహణ వ్యయం విపరీతంగా ఉంటుంది. మెయింటెనెన్స్ ఖర్చులే అధికంగా ఉంటాయి. టికెట్ ధర చూస్తే.. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు రూ. 15 వేలు ఆ పైన పెట్టకపోతే వయబిలిటీ ఉండదు. విజయవాడ నుంచి శ్రీశైలం నడిపే సర్వీసుకు ట్రిప్పుకు రూ.2 లక్షలు ఖర్చు అవుతోందని తెలుస్తోంది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)ను అమలు చేయాలన్నా కూడా సమస్యలు ఉన్నాయి. విమానంలో 14 సీట్లు వరకు ఉంటాయి. ఇందులో నిబంధనలు మార్చితే తప్ప సగం సీట్ల వరకు ప్రభుత్వం వీజీఎఫ్ ఇవ్వటానికి అవకాశం ఉంది. అయినా కూడా ఈ ప్రాజెక్టు నడపటానికి వయబిలిటీ ఉండదన్న వాదనలు వస్తున్నాయి. ప్రభుత్వం పూర్తి ఖర్చును భరించటం కానీ వీజీఎఫ్ నిబంధనలను మార్చటం ద్వారా కానీ సాధ్యం కావటానికి అవకాశం ఉంది. ఈ విమానాలకు మెయింటెనెన్స్ కాస్ట్ ఎక్కువగా ఉండటమే అసలు సమస్య. అందువల్ల శనివారం నిర్వహించే ట్రయల్ రన్‌లో ఏమిటన్నది తేలుతుంది. పర్యాటక రంగాన్ని కొత్త మలుపు తిప్పే సీ ప్లేన్ వంటి ప్రాజెక్టు మనకు సాకారమైతే.. రాజధాని ప్రాంతంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకరంగం మరింత ప్రాచుర్యం పొందుతుంది.

నేడు మచిలీపట్నానికి

వైఎస్ షర్మిల రాక

మచిలీపట్నం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితుడైన శొంఠి నాగరాజు ప్రమాణస్వీకార కార్యక్రమానికి శుక్రవారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నగరానికి వస్తున్నారని, కార్యక్రమం విజయవంతం చేయాలని, కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా షర్మిల మచిలీపట్నం వస్తున్నారన్నారు. ఉదయం 10 గంటలకు షర్మిల మూడు స్తంభాల సెంటర్‌కు వస్తారని, అక్కడ నుంచి పెడన రోడ్డులోని జీ కన్వెన్షన్ హాలులో నిర్వహించే కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని శొంఠి నాగరాజు తెలిపారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి రాజ్య పురస్కారం అందుకుంటున్న గుడి షారోన్ సంజయ్

డీఏవీ విద్యార్థికి రాజ్య పురస్కారం

ఇబ్రహీంపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డీఏవీ పాఠశాలలో పదో తరగతి చదవుతున్న స్కౌట్ విద్యార్థి గుడి షారోన్ సంజయ్ అనే స్కౌట్ విద్యార్థి గురువారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ షేక్ అబ్దుల్ నజీర్ నుంచి రాజ్య పురస్కారం అందుకున్నారు. విద్యార్థిని హెచ్‌ఎం డి.మన్మోమన్, స్కౌట్ మాస్టర్ డి.యోగేశ్వరరావు, విద్యార్థులు అభినందించారు.

స్కౌటింగ్‌తో క్రమశిక్షణ, సేవాభావం

» డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బాల్యం నుంచే స్కౌటింగులో శిక్షణ ఇవ్వడం ద్వారా క్రమశిక్షణ, సేవాభావం అలవడతాయని డీఈవో పీవీజే రామారావు అన్నారు. స్కౌట్ ఫౌండేషన్ డే సందర్భంగా కలెక్టరేట్ సమావేశపు హాలులో డీవైఈవోలు, ఎంఈవోలతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో స్కౌట్, గైడ్ యూనిట్లు వీలయినన్ని ప్రారంభించాలన్నారు. బాలికల గైడ్ యూనిట్లను ప్రారంభించాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం కింద విద్యార్థులకు అన్నం వడ్డించే సమయంలో స్కౌట్ విద్యార్థుల సేవలు వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులకు అంచలెంచలుగా శిక్షణ ఇస్తూ ప్రెసిడెండ్ స్కౌట్లను తయారు చేయాలన్నారు. ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్‌డేకు పంపే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్ కార్యదర్శి లలితా మోహన్, ఏడీ మనోహర్‌నాయక్, గుడివాడ డీవైఈవో పద్మజారాణి, డీసీఈబీ సెక్రటరీ జాన్‌సాహెబ్, ఏఎస్‌వోసీ భాస్కర్, సుభాషిణి, రిటైర్డ్ డీవైఈవో విజయలక్ష్మి, బందరు ఎంఈవో దుర్గాప్రసాద్, ఘంటసాల ఎంఈవో-2 మోమెన్ మాట్లాడారు.

డీఎస్సీ శిక్షణకు 10న స్క్రీనింగ్ పరీక్ష

మచిలీపట్నం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈనెల 10న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత జిల్లా అధికారి షేక్ సాయద్‌బాబు తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ కళాశాలలో 245 మందికి, ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో 195 మందికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్, ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డులు, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తామని, 160 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

11న ఉయ్యూరులో జాబ్‌మేళా

ఉయ్యూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ -సీడాప్, ఎస్‌ఎస్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా నిరుద్యోగ యు వతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 11న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్‌కుమార్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉయ్యూరు బస్టాండ్ సమీపాన శ్రీలంక కాలనీలో ఎస్‌ఎస్‌సీ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించే జాబ్‌మేళాలో బీజెడ్ ఫిన్సర్వ్, పేటీఎం వంటి ప్రము ఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 7981368429, 9392345939 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బెల్ట్ షాపుల నిర్వాహకుల అరెస్టు

50 మద్యం సీసాలు స్వాధీనం

ఉంగుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్న బెల్ట్‌షాపుల నిర్వాహకులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొకినాల, తరిగొప్పల గ్రామాల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న పెరుమాళ్ల రమేష్ (45), వేముల దుర్గారావు(35)ను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 50క్వార్టర్ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై యు.గోవిందు మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. చట్టానికి విరుద్ధంగా ఎటువంటి అక్రమ మద్యం అమ్మకాలు జరిపి నా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. చాటుమాటుగా సాగుతున్న గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల అక్రమరవాణా, బెల్ట్‌షాపులద్వారా అక్రమ మద్యం అమ్మకాలు, పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. బెల్ట్‌షాపులను నియంత్రించడంలో ప్రజలు సహకరించాలన్నారు.

60 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉయ్యూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ అండ్‌ఎస్‌జీఎస్ కళాశాలకు చెందిన 60మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల, సిద్ధార్థ మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, బ్లడ్‌సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ జాస్మిన్ సుల్తానా శిబిరంలో పాల్గొని రక్తదానంపై అపోహలు తొలగించి అవగాహన కల్పించారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు వారు జీవితకాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ తెలియజేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, రెడ్‌రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎండీ నూర్, ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీరామ్‌తేజ, అధ్యాపకులు ఎంఎల్‌ఎస్ కుమారి, ఆర్‌వీ శివరావు పర్యవేక్షించారు.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ

ఉయ్యూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో యువత నైపుణ్య గణన సర్వే పక్కాగా చేపట్టాని ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందికి యువత నైపుణ్య గణన సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటింటికి వెళ్లి 15 నుంచి 59 ఏళ్ల వయస్సు లోపు వారి నైపుణ్యత వివరాలు సేకరించాలన్నారు. మండల పరిధి 10 గ్రామాల్లో నిర్దేశిత వయస్సు కలవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని సచివాలయ సిబ్బందికి సహకరించాలన్నారు. డీఎల్‌డీవో ఎస్.రాజేశ్, చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు పాల్గొని పలు సూచనలు చేశారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్

- విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం చంద్రబాబు శంకుస్థాపన



వర్చువల్‌గా విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. దావాజీగూడెంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ రూ.30.65 కోట్ల వ్యయంతో 132/33 విద్యుత్ ఉప కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈ ఉప కేంద్ర నిర్మాణం పూర్తయితే విమానాశ్రయంతో పాటు విజయవాడ రూరల్, గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని 3.5 లక్షల విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన విద్యుత్ అందుతుందని, ఉప కేంద్ర నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళతామని అధికారులు తెలిపారు. ట్రాన్స్‌కో డీఈలు ఎం.కిరణ్, టి.శ్రీనివాస్, ఏపీసీపీ డీసీఎల్ గుణదల ఏఈ పి.హరిబాబు, డీఈ రామ్మూర్తి నాయుడు, ఏఈ ఎం.వెంకటరాజు పాల్గొన్నారు.

అవగాహనతోనే కేన్సర్ నివారణ

గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతోనే కేన్సర్‌ను నివారించగలమని మండల వైద్యాధికారి పర్వతనేని హర్ష అన్నారు. మండలంలోని ముస్తాబాద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నేషనల్ కేన్సర్ అవగాహన డే సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్ష మాట్లాడుతూ, శరీరంలోని ఏదైనా ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా నియంత్రణ లేకుండా పెరగటం, ఇతర కణజాలాలకు వ్యాపించటం వల్ల ఆయా భాగాల్లో గడ్డలు, పుండు వస్తే కేన్సర్ పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రాణాంతక కేన్సర్‌కు సరైన చికిత్స లేదని తొలిదశలో గుర్తించటం వల్ల చికిత్సతో నయం చేయవచ్చన్నారు. కేన్సర్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవటం మన చేతుల్లోనే ఉందని వివరించారు. ఆయుష్ డాక్టర్ శ్రీధర్‌బాబు, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.



ముస్తాబాదలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ జాన్‌బాషా

సాయిపురంలో రీసర్వే గ్రామసభ

ఉయ్యూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రీసర్వేలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో అధికారులకు అర్జీల ద్వారా తెలియజేసి సద్వినియోగం చేసుకో వాలని సాయిపురం సర్పంచ్ జాన్‌బాషా అన్నారు. సాయిపురంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడా రు. రీసర్వేలో అనేక భూ సమస్యలు వచ్చాయని వాటిని పరిష్క రించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రీసర్వే డీటీ వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ సురేశ్, ఆర్ఐ యతేంద్ర, వీఆర్వో లోకేశ్వరరావు, గ్రామసర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి గ్రామసభలపై సమీక్షిస్తున్న ఎంపీడీవో జోగేశ్వరరావు

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

హనుమాన్‌జంక్షన్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ కూలీలకు పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బందికి ఉందని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఆ గ్రామ సభలు నిర్వహణపై ఉపాధి హామీ పథకం క్షేత్ర స్థాయి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. దానికి అనుగుణంగా పనులు గుర్తించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ లక్ష్మణరావు, ఏపీఓ అశోక్‌కుమార్, జేఈ నాగరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు కానుమోలు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ చింతల

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇష్టంతో కూడిన కృషితోనే ఉత్తమ ఫలి తాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు సూచించారు. కానుమోలు హైస్కూల్‌లో హెచ్‌ఎం పద్మజ అధ్యక్షతన గురువారం జరి గిన కార్యక్రమంలో వివిధ క్రీడా పో టీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినం దించారు. విజయనగరం, తిరుపతి, గుంటూరుల్లో ఈ నెల 11వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్ 14 విభాగంలో బేస్‌బాల్‌కు ప్రభు జ్యోతి, సాఫ్ట్‌బాల్‌కు శ్రావణి, అవి నాష్, వాలీబాల్‌కు ధనుష్, శ్రీవర్ధన్, అండర్ 17 విభాగంలో పావని, నీరజ, అంజి ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు రామచంద్రుడు వివరించారు. ఈ కార్యక్రమంలో దన్నే దుర్గారావు, విద్యాకమిటీ అధ్యక్షుడు తల్లిబోయిన రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుపోషణ మరింత పెరగాలి

విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు



రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణ మరింత పెరగాలంటే యువరైతులతోనే సాధ్యమని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనే యులు అన్నారు. స్థానిక వెటర్నరీ కళాశాల లైవ్‌స్టాక్ కాంప్లెక్స్‌లో 13మంది రైతులకు గత మూడు రోజుల నుంచి పాడి పశువులు పశుగ్రాసాలు, కోళ్ల పెంపకంలో మెళకువలపై ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, శిక్షణకు యువత రావటం, పశుపోషణపై ఆసక్తి కన బర చటం మంచి పరిణామమన్నారు. గేదెలు సూడి నిలవని విషయంపై వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్‌ల సహకారం తీసుకోవాలన్నారు. వెటర్నరీ కళాశాల డీన్ పీవీఎస్ కిషోర్‌తో కలసి ఆంజనేయులు శిక్షణ పూర్తి చేసుకున్న పాడి రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ వెంకటశేషయ్య, డాక్టర్ నరేంద్రనాద్, ఎం.శ్రీవాణి, ఆశాలత, మేనేజర్ మాగంటి హరి, ఏడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ చికిత్సపై అవగాహన

ఉయ్యూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆక్యుపంక్చర్ చికిత్స ద్వారా ఏవిధమైన మందులు లేకుండా చికిత్స సాధ్యమవుతుందని ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్ వ్యవస్థాకుడు మాకల సత్యనారాయణ అన్నారు. వరల్డ్ ఆక్యుపం క్చర్ డే సెలబ్రేషన్స్ - 2024లో భాగంగా ఆక్యుపంక్చర్ థెరపిస్ట్ నారగాని ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీశ్రీనివాస విద్యాసంస్థల ఆవరణలో గురువారం ఆక్యుపంక్చర్ చికిత్సపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, విద్యాసంస్థల అధినేత పి.శ్రీనివాసరావు, శ్రీశ్రీనివాస అక్షరాలయం డైరెక్టర్ నీలిమ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మాకల సత్యనారాయణ



తహసీల్దార్‌కు దరఖాస్తును అందజేస్తున్న సాయికల్యాణి

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ తెలుగు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి తెలిపారు. బుధవారం రాత్రి బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో సాయికల్యాణి తన ఎమ్మెల్సీ ఓటు నమోదు పత్రాలను తహసీల్దార్ నాగభూషణంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపులపాడు మండల ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వలస కార్మికుడు మృతి

గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ ప్యానల్ బోర్డు మీద పడటంతో కాంట్రాక్టర్ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వీరపనేనిగూడెం ఇండస్ట్రీయల్ ఏరియాలో జరిగింది. ఆత్కూరు ఎస్సై సీహెచ్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లాలేష్ (20) గత 5 నెలలుగా వీరపనేనిగూడెం ఇండస్ట్రీయల్ ఏరియాలోని ఒక కంపెనీలో కాంట్రాక్టర్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మరో హెల్పర్ శివప్రసాద్ సహాయంతో రిమోట్ కంట్రోల్‌తో అనుసంధానమై ఉన్న ఒక క్రేన్‌తో అక్కడ తయారయ్యి డెలివరికి సిద్ధంగా ఉన్న ఒక ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డును తగిలిస్తుండగా తన చేతిలో ఉన్న రిమోట్ పొరపాటున జారి పోవడంతో నేలపై పడింది. దీంతో రిమోట్ కంట్రోల్‌తో అనుసంధానం తొలగిపోయిన క్రేన్ ఒక్కసారిగా పక్కకు జరిగింది. అది మోస్తున్న ఎలక్ట్రిక్ ప్యానల్ అదుపుతప్పి క్రింద పడబోతుండగా లాలేష్ దాన్ని ఆపబోయాడు. దాని బరువు ఆపుకోలేక లాలేష్ కింద పడిపోవటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు అతనిని పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పచ్చని పల్లె.. స్వచ్ఛ చల్లపల్లి

స్ఫూర్తివంతమైన స్వచ్ఛసేవా ఉద్యమానికి పదేళ్లు

గాంధీజీ కలలుగన్న స్వచ్ఛభారత్ ఆశయాన్ని ఆచరణలో చూపుతున్న గ్రామం చల్లపల్లి. ఆయన స్ఫూర్తితో 2014లో ప్రధాని నరేంద్రమోదీ భారతీయులకిచ్చిన స్వచ్ఛభారత్ నినాదాన్ని అందుకుని చీపురు పట్టుకున్న చేతులు పదేళ్లుగా శ్రమిస్తూనే ఉన్నాయి. స్వచ్ఛత, పరిశుభ్రత లక్ష్యాలుగా ప్రజలకు ప్రాణం పోసే వైద్య దంపతులు చీపుర్లు చేతబట్టి నిరంతరం శ్రమిస్తున్న వైనం దేశంలో మరెక్కడా లేదుమో, ఇంతటి మహోద్యమానికి సారథ్యం వహించిన డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు నిత్యస్మరణీయులు, స్ఫూర్తిదాతలు.

తెల్లవారుజామున నాలుగున్నర గంటలు అయిదంటే చాలు ఇంటినుంచీ ఒక్కొక్కరుగా కార్యకర్తలు స్వచ్ఛసేవకు బయలుదేరుతారు. నిర్ణయించుకున్న ప్రాంతానికి వెళ్లి పారిశుధ్య పనులు మొదలుపెడతారు. రోడ్లు ఊడ్వటం, డ్రైనేజీలు శుభ్రపరచటం, మొక్కలు నాటటం, కుప్పలుగా మారిన చెత్తను ట్రాక్టర్లకు ఎత్తి డంపింగ్ యార్డుకు తరలించటం. ఇలా ఏ పనైనా వెనకడుగు వేసేదే లేదు. ఆరున్నర గంటలకు విజిల్ వేయటంతో పని ఆపేసి టీ, కాఫీలు తాగి అందరూ ఒకచోట చేరి జై స్వచ్ఛ సుందర చల్లపల్లి అంటూ నినదించి ఆ రోజు విశేషాలు కొద్దిసేపు ముచ్చటించి మరుసటి రోజు ఎక్కడ కలవాలో నిర్ణయించుకుని అక్కడి నుంచీ ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు. ఇది ప్రతి రోజూ గ్రామంలో స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల దినచర్య. వయోభేధం, స్త్రీ, పురుష తారతమ్యం, ధనవంతులూ, పేదవారు, ఉద్యోగులూ, కార్మికులూ అన్న తేడా లేమీ లేవు. అందరూ స్వచ్ఛకార్యకర్తలేనన్న ఏకత్వం ఒక్కటే విభిన్న వ్యక్తులనందరినీ కలిపి స్వచ్ఛ చల్లపల్లి సేవా ఉద్యమంగా మారింది. - ఆంధ్రజ్యోతి - చల్లపల్లి

హణకు సుమారు రూ.3లక్షకు పైగా సొంత డబ్బు ఖర్చుచేస్తుంటారు. తొమ్మిదేళ్లుగా ఇలా ఖర్చుచేస్తూనే ఉన్నారు.

ప్రముఖుల రాక, ప్రభుత్వ అవార్డులు, సన్మానాలు

స్వచ్ఛ చల్లపల్లి మొదటి వార్షికోత్సవ సభకు గానగంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా వచ్చారు. శాంతాబయోటెక్ వరప్రసాద్‌రెడ్డి, సినీ ప్రముఖులు సుద్దాల అశోక్‌తేజ, చంద్రహాస్, జొన్నవిత్తుల, సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి హోదాలో వెంకయ్య నాయుడు, మంత్రులు, ఎంపీలు, ఐఏఎస్‌లు, ప్రజాప్రతినిధులు, వైద్య ప్రముఖులు ఇలా ఎంతో మంది వచ్చి డీఆర్కే దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొని సెమినార్‌లో కేంద్ర మంత్రి చేతుల మీదుగా సన్మానాన్ని అందుకున్నారు.





- దేశస్థాయిలో గుర్తింపు.. ఎల్లలు దాటిన స్వచ్ఛస్ఫూర్తి
- కార్యకర్తల నిస్వార్థ సేవానిరతి
- డీఆర్కే దంపతుల సేవాభావం స్ఫూర్తిదాయకం
- పదేళ్ల వేడుకకు 'స్వచ్ఛ చల్లపల్లి' సిద్ధం





పదేళ్ల ఉద్యమ ప్రస్థానం

జనవిజ్ఞాన వేదిక ద్వారా పాముకాటు వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్యశిబిరాలతో తమవంతు సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్న డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు ప్రారంభించిన స్వచ్ఛ ఉద్యమం పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకోనుంది. 2014 నవంబరు 12న సుమారు 15మంది కార్యకర్తలతో ప్రారంభమైన ఉద్యమంలో ఎందరో భాగస్వాములయ్యారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఈ స్వచ్ఛ ఉద్యమం రాష్ట్ర, దేశస్థాయిలో గుర్తింపుతోపాటు ఎల్లలు దాటి విదేశాలకు సైతం విస్తరించింది.

సుందరీకరణతో టూరిస్ట్ స్పాట్స్

చల్లపల్లి గ్రామం స్వచ్ఛ చల్లపల్లికి ముందు, తర్వాత అని చెప్పవచ్చు. ఎటు చూసినా చెత్త కుండీలు, అపరిశుభ్రత, బహిర్భూమి వీధులు, మినీ డంపింగ్ యార్డుగా మారిన ప్రదేశాలు, పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలతో అధ్వాన్నంగా ఉండే గ్రామంలో స్వచ్ఛ చల్లపల్లి ప్రారంభం తర్వాత మారిపోయింది. చెత్తకుండీలు లేని గ్రామంగా, సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దబడింది. డాక్టర్ పద్మావతి ఆలోచనలతో గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గంగులవారిపాలెం రోడ్డును బాగు చేసి సెల్ఫీ పాయింట్, వాటర్ ఫౌంటైన్‌ను ఏర్పాటు చేసి రంగురంగుల లైట్లు అమర్చి పాత సినిమాల సంగీత పాటలను వినిపిస్తూ ఆ బజారుకు వస్తే మధురానుభూతిని మిగిల్చేలా అభివృద్ధి చేశారు.

స్మశానవాటిక అభివృద్ధి

స్మశానవాటిక అభివృద్ధి స్వచ్ఛోద్యమంలో మణిహారంగా చెప్పవచ్చు. స్మశానవాటిక ప్రాంతం (చిల్లలవాగు గట్టున) గతంలో అధ్వాన్నంగా ఉండేది. ఈ ప్రాంతాన్ని కార్యకర్తలు శుభ్రం చేయటం నభూతో న భవిష్యతి ఉన్నట్టు మారిపోయింది. దాదాపు నెలరోజులు శ్రమించి స్మశానవాటిక ప్రాంతాన్నీ, డంపింగ్ యార్డు ప్రాంతాన్ని శుభ్రపరిచి సుందరీకరణ ప్రారంభించారు. తర్వాత తరిగోపుల ప్రాంగణంగా పేరు పెట్టారు.

వేల మొక్కలతో పచ్చనిపల్లె

స్వచ్ఛ ఉద్యమం ప్రారంభించాక వర్షాకాలంలో మొక్కలు నాటడం ప్రారంభించారు. తొలుత విజయవాడ రోడ్డు, నాగాయలంక రోడ్డులో మొక్కలు నాటి తర్వాత అవకాశమున్న ప్రతి రహదారులూ, వీధుల్లో సుమారు 30వేల పైగా మొక్కలు నాటి సంరక్షించటంతో నేడు చల్లపల్లిలో ఎటువైపున చూసినా పచ్చనిచెట్లు, పుష్పసోయగం దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా కాసానగర్ నుంచీ రామానగరం వరకు మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ప్రముఖులు నాటిన మొక్కల వద్ద నామఫలకాలు ఏర్పాటుచేసి ఏ రోజు నాటిందీ, ఎవరు నాటిందీ రాస్తున్నారు.

ప్రజోపయోగ కార్యక్రమాలు

స్వచ్ఛ చల్లపల్లి మొదటి వార్షికోత్సవంలో 'మన కోసం మనం' ట్రస్ట్‌ను ఏర్పాటుచేశారు. హైదరాబాద్ సన్‌షైన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ గురవారెడ్డి ప్రోత్సాహంతో ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి గ్రామంలో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టారు. ట్రస్ట్‌కు విరాళాలు 10 శాతం వస్తే 90 శాతం డాక్టర్ డీఆర్కే దంపతులే ఖర్చుచేస్తుంటారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 23 మంది సిబ్బంది పనిచేస్తుంటారు. నెల నెలా వారికి, వాహనాల నిర్వ

ఇది సమష్టి కృషి: డాక్టర్ డీఆర్కే ప్రసాద్ - డాక్టర్ పద్మావతి



స్వచ్ఛ చల్లపల్లి పదేళ్ల ప్రస్థానం సమష్టి కృషి. గ్రామంలో నిస్వార్థంగా జరిగే కార్యక్రమం. ప్రతిఫలం ఆశించకుండా కార్యకర్తలు శ్రమిస్తుంటే వారికెలా కృతజ్ఞతలు చెప్పగలం. ప్రభుత్వం అన్ని పనులూ చేయలేదు. ప్రజారోగ్యం కోసం గ్రామంలో స్వచ్ఛత, పరిశుభ్రత కోసం పనిచేయాలనుకున్నాం. డబ్బు సంపాదించి మిగుల్చుకోవటం వల్ల ఉపయోగం లేదు. ధనవంతులు తమకు నచ్చిన రంగంలో 10శాతం ఖర్చుచేస్తే బావుంటుంది. స్వచ్ఛ చల్లపల్లికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

ప్రజల క్షేమం, నగరాభివృద్ధే లక్ష్యం

- ఎంపీ శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాక్షేమాన్ని కాంక్షిస్తూ, నగరాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని విజయవాడను ప్రగతి పథం వైపు నడిపిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులతో నగరాభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విజయవాడ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర విజయవాడలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, మురుగునీటి పారుదల వ్యవస్థ, తాగునీటి సరఫరా వ్యవస్థ, క్రీడలు, స్టేడియాల అభివృద్ధి తదితర అంశాలపై అభివృద్ధికి కావాల్సిన వనరుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ముఖ్యంగా విజయవాడలో వరద ముంపునకు గురికాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో కొండ ప్రాంత ప్రజలకు 24 గంట లూ తాగునీరు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా స్టేడియాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని ఇందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంపీ సూచించారు. ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేయాలని వీఎంసీ ఆర్థిక పరిపుష్టికి, నగరాభివృద్ధికి, తనవంతు సహకారాన్ని అందిస్తానని ఎంపీ చెప్పారు. ప్రాజెక్టుల అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, సి.ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి. ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్యకీర్తన, ప్రభుదాస్, డిప్యూటీ కమిషనర్ జి.సృజన, ఆర్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస, ఎస్ఈలు సత్యనారాయణ, సత్యకుమారి, ఈఈలు వెంకటేశ్వర్‌రెడ్డి, సామ్రాజ్యం పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చిత్రంలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



రైతు గాంధీ ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాజధాని రైతు ఇంటికెళ్లిన మంత్రి నారాయణ

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూ సమీకరణ కింద ఇంకా భూములివ్వాల్సిన రైతుల అనుమానాలను మున్సిపల్ మంత్రి నారాయణ వారిళ్లకే వెళ్లి నివృత్తి చేస్తున్నారు. అనంతరం వారి నుంచి అంగీకార పత్రాలు తీసుకుంటున్నారు. రాజధానిలో భూములు కలిగిన విజయవాడకు చెందిన రైతు అనుమోలు గాంధీ నివాసానికి మంత్రి నారాయణ గురువారం వెళ్లారు. భూ సమీకరణ కింద తీసుకునే భూముల్లో చేపడుతున్న పనుల గురించి మంత్రి వారికి వివరించారు. ప్రభుత్వం రాజధాని పునర్నిర్మాణానికి ఎంతో కష్టపడుతోందన్నారు. భూ సమీకరణలో వారికున్న అపోహలను నివృత్తి చేశారు. మంత్రితో పాటు సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్ చంద్ పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రి రాజధాని గ్రామాల్లో పలువురు రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి భూ సమీకరణ అంగీకార పత్రాలను స్వీకరించారు.

ఆప్కాబ్‌కు ఉత్తమ ప్రతిభా పురస్కారం

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార బ్యాంక్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ప్రతిభా పురస్కారం దక్కించుకుంది. త్రీటైర్ కేటగిరిలో దేశస్థాయిలో ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్టు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సమాచారం ఇచ్చింది. ఈనెల 26న ఢిల్లీలో ఈ పురస్కారం ప్రదానం చేస్తారు.

స్వచ్ఛసర్వేక్షణ్ 7 స్టార్ సర్టిఫికేషన్ కోసం వీఎంసీ దరఖాస్తు

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరపాలక సంస్థ 64 డివిజన్లలో సమయానికి చెత్తను సేకరించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటంతో 2024కుగాను 7స్టార్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసింది. 2023లో ఇదే అంశానికి వీఎంసీకి 5స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ లభించింది. ఈ మేరకు వీఎంసీ ఒక ప్రకటన విడుదల చేస్తూ 7స్టార్ అప్లికేషన్ దరఖాస్తు చేస్తున్నందున వ్యక్తికి లేదా వ్యక్తులకు ఎవరికైనా అభ్యంతరాలుంటే 10రోజుల్లోపు అభ్యంతరాలను తెలియజేయాలని కోరింది. అభ్యంతరాలను 8181960909 నెంబరుకు తెలియజేయవచ్చు.

పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి డిప్యూటీ ఐజీ సరోజ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రిజిస్ట్రేషన్స్ స్టాంపుల శాఖ డిప్యూటీ ఐజీ సరోజ గురువారం పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్డ్ ప్రైమ్ 2.0 పరిశీలనతో పాటు, ఇటీవల పార్టీషన్స్‌కు సంబంధించి అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ఆమె వచ్చారు. సబ్ రిజిస్ట్రార్ రేవంత్, డిప్యూటీ ఐజీ సరోజకు పూర్తి విషయాలు తెలిపారు. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ తగ్గిపోతుండటంతో పార్టీషన్స్ తగ్గుదలకు కారణమన్న అంశాలను వివరించారు. అనంతరం ఆమె వెళ్లిపోయారు. వర్క్‌షాప్ నేపథ్యంలో ఇక్కడికి వచ్చినట్టు తెలుస్తోంది.

స్నాచర్‌గా మారిన జిమ్ ట్రైనర్

అప్పులు తీర్చడానికి గొలుసు చోరీలు

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక పక్క జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. మరోపక్క హోల్డింగ్ డ్రైవర్. ఇలా రెండు చేతులా సంపాదిస్తున్నా అప్పులు తీరడం లేదు. దీంతో ఆ యువకుడు స్నాచర్‌గా మారాడు. విజయవాడలో వరుసగా చైన్ స్నాచింగ్‌లు చేసిన అతడిని సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సనత్‌నగర్‌కు చెందిన లంకాడి వెంకటేష్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ ఉన్నప్పుడు హోల్డింగ్ డ్రైవర్‌గా వెళ్తుంటాడు. తండ్రి చేసిన అప్పులు భారంగా మారాయి. సంపాదన సరిపోవడంలేదు. సులువుగా డబ్బులు సంపాదించడానికి చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. తన బావమరిది, స్నేహితుడి బైక్‌లను ఉపయోగించుకుని స్నాచింగ్‌లకు దిగాడు. అక్టోబరు 28న పెనమలూరు పీఎస్ పరిధిలోని కాల్వగట్టు కృష్ణా ఆలయం వద్ద ఒంటరిగా వెళ్తున్న వృద్ధురాలి మెడలో గొలుసును కాజేశాడు. అదే రోజు వెటర్నరీ కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో బంగారం గొలుసు లాగేశాడు. దీనిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేష్‌ను సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ బృందం ఏలూరు రోడ్డులోని ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద అరెస్టు చేసింది. అతడి నుంచి 62 గ్రాముల రెండు బంగారు గొలుసులు, స్నాచింగ్‌లకు ఉపయోగించిన యాక్సిస్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.3.70 లక్షలుంటుందని సీసీఎస్ పోలీసులు తెలిపారు.



అరెస్టు చేసిన నిందితుడు వెంకటేష్‌తో ఏడీసీపీ రాజారావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు

ఎంఎస్ఎంఈ నిబంధనలు సరళతరం చేయాలి: మంత్రి కొండపల్లి

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటు కోసం అవసరమైతే నిబంధనలను సరళతరం చేసి రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ శాఖ పనితీరుపై గురువారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో కూటమి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన పారిశ్రామిక విధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొత్తగా ఎంఎస్ఎంఈలను అధికసంఖ్యలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి: ఫ్యాప్టో

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇస్తున్న లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో రెసిడెన్షియల్ విధానాన్ని రద్దుచేయాలని ఫ్యాప్టో కోరింది. ఫ్యాప్టో నేతలు ఎస్.చిరంజీవి, ఎన్.వెంకటేశ్వర్లు, ఎం.రఘునాథరెడ్డి, జి.హృదయరాజు, సీహెచ్ మంజుల, కె.సురేశ్ తదితరులు గురువారం విజయవాడలో సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ వల్ల టీచర్లు ఒత్తిడికి గురవుతున్నారని, వారికి ఉపశమనం కలిగించేలా నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించి రాబోయే శిక్షణ కార్యక్రమాలను నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామని ఎస్పీడీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

చోరీ కేసులో నిందితులకు జైలు

విజయవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నేరం రుజువుకావడంతో గుంటూరు జిల్లాకు చెందిన షేక్ ఆసిఫ్, జాస్తి వెంకట సాయి, ప్రకాశం జిల్లాకు చెందిన షైదకూరి ఆసిఫ్‌కు విజయవాడ మొదటి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఏడాది జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పును ఇచ్చింది. విజయవాడ మొగల్రాజపురానికి చెందిన వ్యక్తి సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని డిజిటల్ స్టూడియోలో పనిచేసేవాడు. ఫిబ్రవరి 3న అతడు స్టూడియోకు వచ్చి వాహనాన్ని బయట పార్క్ చేశాడు. ఈ ముగ్గురు కలిసి ఆ వాహనాన్ని చోరీ చేశారు. తర్వాత అదే నెలలో 9న గుంటూరు పోలీసులకు చిక్కారు. వారిని పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువుకావడంతో నిందితులు ఒక్కొక్కరికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి సయ్యద్ జియావుద్దీన్ తీర్పు చెప్పారు.

చిన్నారుల కోసం 3.89 లక్షల డైపర్ల విరాళం

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కింబర్లీ-క్లార్క్ ఇండియా సంస్థ చిన్నారుల కోసం 3.89 లక్షల డైపర్లను విరాళంగా ఇచ్చింది. నవంబరు 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.34.95 లక్షల విలువైన డైపర్లను పేద వర్గాల పిల్లలకు ఇచ్చేందుకు ఈ విరాళం అందించింది. గురువారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి కింబర్లీ-క్లార్క్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ ఆస్థాన, సంస్థ ప్రతినిధి ప్రీతి బినోయ్ డైపర్ల కోసం చెక్కును అందించారు. కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి పాల్గొన్నారు.

ఏషియన్ గేమ్స్ కాంస్య పతక విజేత హిమతేజకు మంత్రి అభినందన

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన పరుగుల వీరుడు జలీ హిమతేజ ఇటీవల దుబాయ్‌లో జరిగిన అండర్-20 జూనియర్ ఏషియన్ గేమ్స్‌లో 4 ఇంటూ 100 మీటర్ల రిలే పోటీల్లో కాంస్యంతో సత్తా చాటాడు. నగరంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని హిమతేజ గురువారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిసి పతకాన్ని ఆయన చేతులమీదుగా అందుకున్నారు. అతి తక్కువకాలంలో అంతర్జాతీయంగా రెండు పతకాలు, జాతీయంగా ఐదు, రాష్ట్రస్థాయిలో 9 పతకాలను సాధించడం అభినందనీయమని మంత్రి మండిపల్లి అభినందించారు. నూతన క్రీడా పాలసీ ద్వారా క్రీడాకారులకు మంచి భవిష్యత్ అందించేందుకు సీఎం చంద్రబాబు, తాను సిద్ధంగా ఉన్నామని రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు.





విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాల అందిస్తున్న ఏపీబీఏ సెక్రటరీ పోలినేని అంకమ్మ చౌదరి, హరికృష్ణ

సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ విజేతలు సోహాన్, మనస్వి

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాసా వడ్లమూడి మోహన్‌కృష్ణ మెమోరియల్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ అండర్-13 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌లుగా కోట సాయి సోహాన్ (గుంటూరు), ఎస్ మనస్వి (ప్రకాశం) నిలిచారు. గురువారం నాటి హోరాహోరీ ఫైనల్స్‌లో సోహాన్ ఎం జశ్వంత్ (కర్నూల్)పై 21-16,21-14తోను, బాలికల విభాగంలో ఎస్ మనస్వి డీ ఆశాశ్రీ (ప్రకాశం)పై 18-21, 21-12, 21-14తో జయభేరి మోగించి టైటిళ్లను తమఖాతాలో వేసుకున్నారు. బాలురు డబుల్స్‌లో జీ షణ్ముక్ వర్ధన్ (ప్రకాశం), ఎం జశ్వంత్ (కర్నూల్) జోడి సీహెచ్ మహీధర్ రెడ్డి, టి.వర్షిత్ (నెల్లూరు) జోడిపై 21-18, 21-3 తోను, బాలికల డబుల్స్‌లో జీ వెంకట లతా రెడ్డి (నెల్లూరు), శ్రీరామ్ కావ్య (కర్నూలు) జోడి డీ ఆశా శ్రీ, ఎస్ మనస్వి (ప్రకాశం)పై 21-16, 12-21, 21-19 గెలిచి టైటిళ్లను వశం చేసుకున్నారు. స్థానిక చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకల్లో ఏపీబీఏ సెక్రటరీ డాక్టర్‌పోలినేని అంకమ్మ చౌదరి, కేడీబీఏ ఉపాధ్యక్షుడు వడ్లమూడి హరికృష్ణ, రిటైర్డు లెక్చరర్ అడుసుమిల్లి శ్రీనివాసరావు పాల్గొని క్రీడాకారులు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



కబడ్డీలో తలపడుతున్న ఉద్యోగులు

ఉత్సాహంగా సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా సెలక్షన్స్ ఐజీఎంసీలో గురువారం నిర్వహించామని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు. కబడ్డీలో 70 మంది, బాస్కెట్‌బాల్‌లో 38 మంది, ఖోఖోలో 85 మంది, క్యారమ్స్‌లో 90 మంది ఉద్యోగులు తలపడ్డారు. ఫుట్‌బాల్ ఎంపికలను గుంటూరులో 33 మందికి పోటీలు ఆయా కోచ్‌ల పర్యవేక్షణలో నిర్వహించామన్నారు.

రేపటి నుంచి స్పోర్ట్స్‌మీట్

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి 11 వరకు మోంట్ జెనిత్ - 2024 పేరిట 35వ మోంట్‌ఫోర్ట్ జాతీయ గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్టు బ్రదర్ రాయప్పరెడ్డి తెలిపారు. స్కూల్ ఆవరణలో ట్రోఫీలు గురువారం ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాలలోని మోంట్‌ఫోర్టు విద్యాసంస్థలకు చెందిన 30 స్కూల్స్ నుంచి 1500 విద్యార్థులు బాస్కెట్‌బాల్, ఖో-ఖో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో తలపడతారన్నారు. ఈ పోటీలను 9న ఉదయం 9 గంటలకు స్కూల్ పూర్వ విద్యార్థి, మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభిస్తారని, 11న సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమానికి మరో పూర్వ విద్యార్థి, మంత్రి నారా లోకేష్, బిషప్ తెలగతోటి రాజారావు విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారన్నారు. కరస్పాండెంట్ బ్రదర్ మౌంటీ మాట్లాడుతూ 1973లో గన్నవరం సెయింట్ జాన్స్ స్కూల్‌లో క్రీడాపోటీలను ప్రారంభించామని, వివిధ చోట్ల రీజియన్‌ల వారీగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోటీల ప్రారంభోత్సవంలో హైదరాబాద్ ప్రోవెన్సీ సుపీరియర్ రెవరెండ్ బ్రదర్ పైన్ అలెక్స్, ఎడ్యుకేషన్ కన్వీనర్ బ్రదర్ సంతోష్‌కుమార్ పాల్గొంటున్నారన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, గుర్జిత్‌సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రియాంక, పీఈటీ అనిల్ పాల్గొన్నారు.

మెడికల్, సేల్స్ రిప్స్ సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటెటీవ్స్ ధర్నా

ధర్నాచౌక్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెడికల్ అండ్ సేల్స్ రిప్స్‌ను హైలిస్కిల్డ్ లేబర్‌గా గుర్తించి నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరి సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేదంటే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సెల్స్ రిప్రజెంటెటీవ్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో రాష్ట్రస్థాయి ధర్నా గురువారం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పని దినాలు కల్పించాలన్నారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. ఉద్యోగులపై ఫార్మా కంపెనీ యాజమాన్య దాడులను అరికట్టాలన్నారు. ప్రభుత్వరంగ మందుల కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ ఎత్తి వేయాలన్నారు. ఆరోగ్య రంగానికి జీడీపీ కనీసం 5 శాతం నిధులు కేటాయించాలన్నారు. యూనియన్ నేత కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీహెచ్.బాబురావు, యూనియన్ నేతలు క్రిష్ణయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

నూజివీడు - వట్లూరు మధ్య పలు రైళ్లు మళ్లింపు

రైల్వే స్టేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నూజివీడు-వట్లూరు మధ్య పలు రైళ్లను దారిమళ్లిస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం.మండ్రోపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8, 11, 12 తేదీల్లో నడిచే ధన్‌బాద్-అల్లపూజ (13351) రైలు ఈనెల 7న నడిచే టాటా-యశ్వంతపూర్ (18111) అలాగే సత్రాగచి-సనత్‌నగర్ (07070) ఈనెల 8, 13 తేదీల్లో నడిచే విశాఖపట్నం-విజయవాడ (08567), ఈనెల 8న నడిచే టాటా-ఎస్ఎంవీ బెంగళూరు (112889), ఈనెల 11న నడిచే హాథియా-ఎర్నాకులం (22837), ఈనెల 12న నడిచే హథియా -ఎస్ఎంవీ బెంగళూరు (12835) రైళ్లను నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా మళ్లిస్తారు. ధన్‌బాద్-అలపూజ రైలును తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్లలో, టాటా-యశ్వంతపూర్, సత్రాగచి-సనత్ నగర్ రైళ్లను ఏలూరు స్టేషన్‌లో, విశాఖపట్నం-విజయవాడ రైలును గన్నవరంలో, హాథియా-ఎర్నాకులం రైళ్లను ఏలూరు స్టేషన్‌లో నిలుపుదల చేయరు.

వరద బాధితులకు రూ.90,54,999 విరాళం

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొవ్వూరు నియోజకవర్గం తరపున ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు రూ.90,54,999 విరాళంగా అందజేశారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి, ఆయన చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నేతలను సీఎం అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.565

ఉద్యోగులు బాధ్యత, క్రమశిక్షణతో పనిచేయాలి

గుడివాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామసచివాలయ ఉద్యోగులు బాధ్యత, క్రమశిక్షణతో పని చేయాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గద్దె పుష్పరాణి అధ్యక్షతన స్కిల్ డెవలప్‌మెంట్ యాప్ వినియోగం, యువతలో నైపుణ్యం పెంపు తదితర అంశాలపై శిక్షణ తరగతులు జరిగాయి. మండలంలోని 12 సచివాలయాల పరిధిలో ఉన్న ఉద్యోగులు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిరుద్యోగ యువత నైపుణ్యాలను పెంపొందించుకొని స్వశక్తితో ఎదిగే విధంగా కృషి చేయాలన్నారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఈవోపీఆర్డీ జి.శ్రీనివాసరావు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు!

- మున్సిపల్ కార్యాలయం ఎదుటే..
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు
- షెడ్డు వేసి, బడ్డీ పెట్టేశారు
- సిద్ధంగా ఉన్న మరికొందరు
- ఎమ్మెల్యే ఆశయానికి తూట్లు



కాలువను ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన షెడ్డు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

మున్సిపల్ కార్యాలయం ఎదుట యథేచ్ఛగా ఆక్రమణలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. పక్కా షెడ్డుతో బడ్డీ పెట్టి ఆక్రమణదారులు మున్సిపల్ అధికారులకు సవాల్ విసిరారు. ఇదే అదనుగా మరికొందరు అదే బాటలో మరికొన్ని ఆక్రమణలకు సిద్ధమై గ్రీన్ సిటీగా గుడివాడను మార్చాలని ఎమ్మెల్యే వెనిగండ్ల పెట్టుకున్న ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు.

కొత్త మున్సిపల్ కార్యాలయం ఎదుట చింతల కాలువ గట్టుపై మున్సిపల్ అధికారులు సుందరీకరణ పేరుతో సిమెంట్ రాళ్లను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు కాల్వగట్టును ఇష్టానుసారంగా ఆక్రమించుకుని అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకున్నారు.అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ చేసి కనీసం రాకపోకలకు ఇబ్బంది కలిగించినా అప్పట్లో అధికారులు స్పందించలేదు. ఐదేళ్ల పాటు వైసీపీ నాయకుల ఆక్రమణల పర్వం కొనసాగింది. ఆక్రమిత పన్ను కడుతూ సొంత ఆస్తిలా మున్సిపల్ అధికారులపై వైసీపీ నాయకులు పెత్తనం సాగించారు.

మొదట్లో ఉక్కుపాదం

కూటమి ప్రభుత్వం రావడంతోనే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆక్రమణలపై ఉక్కుపాదం మోపింది. చింతల కాల్వ గట్టుపై ఆక్రమణలను తొలగించింది. దీంతో కొందరు పూర్తిగా వెళ్లిపోగా, కొందరు మాత్రం కార్యాలయం గోడ వెంబడి బడ్డీలు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. అడ్డదిడ్డంగా బడ్డీలను పెట్టి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. పది రోజుల క్రితం రాత్రికి రాత్రి బడ్డీని ఏర్పాటు చేస్తే మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు తొలగించారు.

మళ్లీ ఆక్రమణలు ప్రారంభం

మూడు రోజులుగా చింతల కాల్వగట్టుపై మున్సిపాల్టీ ఏర్పాటు చేసిన సిమెంట్ రాళ్లను స్టేడియం రహదారి వరకు ఆక్రమించుకున్నారు. సుమారు సెంటున్నర స్థలంలో పక్కా షెడ్డు ఏర్పాటు చేసి జ్యూస్ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. చుట్టూ పరదా కట్టారు. కార్యాలయం ఎదుట ఇష్టానుసారంగా ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం అటు వైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయడం లేదు. కార్యాలయం గోడ వెంబడి ఉన్న బడ్డీని కాల్వగట్టుపై పెట్టారు. ఇదే అదనుగా మరికొందరు కూడా తమ బడ్డీలను తరలించేందుకు సిద్ధమవుతున్నారు.

ఎమ్మెల్యే తాలుకా పేరుతో బెదిరింపులు

ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు వెళ్లిన మున్సిపల్ అధికారులపై సదరు ఆక్రమణదారుడు బెదిరింపులకు దిగినట్లు తెలియవచ్చింది. తాను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తాలుకా అంటూ గదమాయింపులకు దిగడంతో చేసేదేమి లేక పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు వెనుదిరిగారట.

ఎమ్మెల్యే వెనిగండ్ల ఆశయానికి తూట్లు

పట్టణాన్ని గ్రీన్ సిటీగా మార్చాలనే లక్ష్యంతో ఇటీవల విజయవాడ ఆర్కిటెక్చర్ కళాశాల నిపుణులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పట్టణ సుందరీకరణపై ప్రణాళిక కూడా సిద్ధం చేస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు చింతల కాల్వ ప్రాంతాన్ని సుందరవనంగా మార్చాలని ప్లాన్ సైతం సిద్ధం చేసుకున్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల పేరుతో ఆక్రమణలు వెలిస్తే క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడ ఎలా సాధ్యమవుతుందని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆక్రమణను వెంటనే తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో రహదారులు, కాల్వలను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్




సిద్ధంగా ఉన్న బడ్డీలు

బేకరీ దుకాణాల్లో తనిఖీ



బేకరీలో తనిఖీలు చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు

గుడివాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బేకరీ ఉత్పత్తులను తిని ప్రజలు అనారోగ్యానికి గురైతే బేకరీ యజమానుపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. గౌరీశంకరపురంలోని బేకరీని ఆయన తనిఖీ చేశారు. వంటశాల నుంచి దుకాణం వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. బేకరీ యజమానులు నిల్వ ఉంచిన బ్రెడ్‌లను అమ్మవద్దని, నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు. పురపాలక సంఘం ప్రజారోగ్యశాఖ నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణను మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త సేకరణను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ పి.శ్రీనివాసరావు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

నింగినంటుతున్న నిత్యావసరాలు..

పమిడిముక్కల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర సరుకుల ధరలు అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయని ఏపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బాణావత్ భుజంగ నాయక్ ఆరోపించారు. పమిడిముక్కలతో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధరలు అరికట్టడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. ధరల నియంత్రణకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాయకత్వంలో ఏర్పాటుచేసిన కమిటీతో ఒరిగిందేమి లేదన్నారు. ప్రచారం కోసం ప్రజలను మభ్యపెట్టకుండా నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

న్యాయవాదులపై దాడులు దారుణం



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

గుడివాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులపై అక్రమ కేసులను బనాయించడాన్ని, దాడులు చేయడాన్ని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బొల్లవరపు అజయ్‌బాబు తీవ్రంగా ఖండించారు. ఏలూరురోడ్డులోని న్యాయస్థాన భవన సముదాయాల వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. నందిగామలో బార్ అసోసియేషన్ సభ్యుడు నడూరి శ్రీరామమూర్తిపై దాడి చేయడమే కాకుండా, తిరిగి ఆయనపైనే పోలీసులు కేసును బనాయించడం దారుణమన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తుమ్మలచర్ల శ్రీనివాసరావు, న్యాయ వాదులు చేరగుడి కుటుంబరావు, వీరాబత్తిన సుధాకర్, సిహెచ్ సూర్యారావు, సయ్యద్ అజీమ్, నత్తా జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల దొంగల అరెస్టు

పెదపారుపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొన్నాళ్లుగా గొర్రెలను అపహరిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ శుభాకర్ తెలిపారు. తెలిపారు వారి వద్ద నుంచి ఆరు గొర్రెలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వెంట్రప్రగడలో బడ్డీషాపు దొంగతనం కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరినీ గుడివాడ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

‘స్క్రీనింగ్‌తో కేన్సర్‌పై విజయం సాధ్యమే’

పెదపారుపూడి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : వానపాముల గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ‘స్క్రీనింగ్‌తో కేన్సర్‌పై విజయం సాధ్యం’ కార్యక్రమం గురువారం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకిరెడ్డి మాట్లాడుతూ, స్క్రీ నింగ్‌తో ముందుగానే క్యాన్సర్‌ను గుర్తించినట్లైతే చికిత్స చేయటం, నయం చేయటం సులభమవుతుందన్నారు. ఇంటి వద్దనే 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఉచితంగా ముందస్తు కేన్సర్ నిర్ధారణ పరీక్ష చేయించుకుని రక్షణ పొందాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, యశోద, ఆశా వర్కర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

11న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా

గుడివాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళాను కేబీఆర్ ఐటీఐ కళాశాలలో ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అప్రెంటీస్ ఎంపిక ప్రక్రియ చేస్తారన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన, అప్రెంటీస్ పూర్తికాని అభ్యర్థులు ట్రేడ్‌ల వారిగా తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌తో హాజరు కావాల్సిందిగా ప్రిన్సిపాల్ గౌరీమణి కోరారు.

కొండాలమ్మ ఆలయంలో నిత్య పుష్పార్చన

గుడ్లవల్లేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొండాలమ్మ ఆలయంలో ఇకపై నిత్య పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. అమ్మవారికి అభిషేకం, పుష్పార్చన, పంచహారతులు నిర్వహిస్తామన్నారు.

ఉయ్యూరులో 60 మంది విద్యార్థుల రక్తదానం

ఉయ్యూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలకు చెందిన 60మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల, సిద్ధార్థ మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, బ్లడ్‌సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ జాస్మిన్ సుల్తానా శిబిరంలో పాల్గొని రక్తదానంపై అపోహలు తొలగించి అవగాహన కల్పించారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు వారు జీవితకాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ తెలియజేశారు.



పోలుకొండలోని ఆక్వా దుకాణంలో తనిఖీ చేస్తున్న మత్స్య శాఖ అధికారులు

ఆక్వా మేత దుకాణాల్లో తనిఖీ

నందివాడ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : పోలుకొండలోని చేపల మేతల షాపులను గురువారం మత్స్యశాఖ అధికారులు తనిఖీ చేశారు. మూడు షాప్‌లను తనిఖీ చేసినట్లు మండల ఫిషరీష్ అధికారి రవికుమార్ తెలిపారు. వివిధ ఉత్పత్తులను, చేపలు, రొయ్యల మేతలను, ప్రొబయోటిక్స్, ఫీడ్ సప్లిమెంట్, మినరల్స్ పరిశీలించినట్లు చెప్పారు. నిషేధిత యాంటీబయోటిక్స్ ఉత్పత్తులను విక్రయించరాదని షాపు యజమానులకు తెలియజేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆక్వా యజమానులు మత్స్యశాఖ అనుమతులను తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ (విజయవాడ) శ్రీరామ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (గుడివాడ) శ్రీ ప్రసాద్, ఫిషరీష్ డెవలప్‌మెంట్ అధికారి (నందివాడ) రవికుమార్ పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో..

గుడివాడ రూరల్ : మండలంలో పురుగు మందుల షాపుల వద్ద నమూనాలను సేకరించినట్లు మండల వ్యవసాయశాఖాధికారిణి బోలెం అనంతలక్ష్మి తెలిపారు. వంశీ కృష్ణ తదితర షాపుల్లో పురుగుమందుల శాంపిల్స్ తీసుకుని పురుగు మందుల డబ్బాలకు సీల్ వేసి అమరావతి, పల్నాడు ప్రాంతాల ల్యాబ్‌లకు పంపామని తెలిపారు. ఎరువులను నిర్దేశిత ధరలకు మాత్రమే విక్రయించాలని కోరారు. ఎక్కువ రేట్లు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీను

పోక్సో చట్టంపై అవగాహన

పమిడిముక్కల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు, బాలికలతో అసభ్యకరంగా మాట్లాడిన ప్రవర్తించినా పోక్సో చట్టం కింద కఠినంగా శిక్షిస్తామని పమిడిముక్కల ఎస్సై బి.శ్రీను అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించకపోతే జరిగే అనర్థాలు, ట్రాఫిక్ రూల్స్‌పై సవివరంగా విద్యార్థులకు వివరించారు.

కౌతవరం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో..

గుడ్లవల్లేరు : అత్యాచారం, అఘాయిత్యాల నుంచి బాలికలు ఎలా రక్షణ పొందాలనే విషయమై కౌతవరం జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థినులకు గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ అవగాహన సదస్సు నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లను తెలుసుకోవాలన్నారు. దుర్మార్గుల నుంచి ప్రమాదం గుర్తిస్తే వెంటనే 112 లేదా 1930 నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందిస్తే పోలీసులు వెంటనే రక్షణ కల్పిస్తారన్నారు. విద్యార్థులకు రహదారి భద్రత, మాదకద్రవ్యాల వినియోగం వల్ల సంభవించే నష్టాలు, సైబర్ మోసాలపై ఎస్సై సత్యనారాయణ అవగాహన కల్పించారు.



కౌతవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..

మర్యాదపూర్వక కలయిక

మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్యను కలిసిన ఎమ్మెల్యే కుమార్‌రాజా



పామర్రు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిస్వార్థ నేతగా పేరొందిన మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్యను కలవడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. కానూరులో నివాసముంటున్న రామయ్యను గురువారం కుమార్ రాజా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రామయ్య ఆరోగ్యం, క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల మీద నిరంతరం పని చేసే వారినే జనం ఆదరిస్తారనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కూమార్ రాజాకు రామయ్య సూచించారు. కుమార్ రాజా అందిస్తున్న సేవలను రామయ్య అభినందించారు. కుమార్‌రాజా మాట్లాడుతూ, రామయ్య అందించిన సూచనలు, సలహాలు తన రాజకీయ జీవితానికి ఎంతో దోహదం కానున్నాయన్నారు. తొలుత పాటూరు రామయ్యకు కుమార్‌రాజా పాదాభివందనం చేసి, ఆయన్ని దుశ్శాలవాతో సత్కరించారు.



మొవ్వ మండలం పెదముత్తేవిలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామసభలు

కూచిపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామసభలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పి.జగన్మోహనరావు పేర్కొన్నారు. పెదముత్తేవిలో గురువారం జరిగిన గ్రామసభలో రైతులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు దాఖలు చేశారు. సర్పంచ్ ఉప్పలపాటి నాగ లక్ష్మి ప్రసన్న, మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, మండల సర్వేయర్ అనపర్తి కిషోర్, ఏవో కె.శివప్రసాద్, సచివాలయ సర్వేయర్ షేక్ షర్మిల, కార్యదర్శి కె.సందీప్ రెడ్డి, వీఆర్వో తిరుమలరావు పాల్గొన్నారు.

అనుమనపూడిలో అయ్యప్పల పడిపూజ



నందివాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప మాలధారులు అనుమనపూడిలో గంటా రామబ్రహ్మం ఇంటి వద్ద కేరళ తాంత్రికుడు గురుస్వామి కూటికుప్పల వెంకన్న స్వామి ఆధ్వర్యంలో పడిపూజ ఘనంగా నిర్వహించారు. సుమారు 150 మంది పడి పూజలో పాల్గొని పూజా తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏడుకొండలు గురుస్వామి, నాగరాజు, గణేష్, సాయి, సుబ్రహ్మణ్యం, జగన్, కృష్ణయ్య, కిషోర్, ఇతర గ్రామాల స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ బాలికల వసతిగృహం పరిశీలన



బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సారథి, తహసీల్దార్ లోకరాజు

గుడ్లవల్లేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు డైట్ కళాశాలలో బీసీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో సారథి, తహసీల్దార్ లోకరాజు గురువారం పరిశీలించారు. విద్యార్థినిలతో అధికారులు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాలు కురిస్తే శ్లాబ్ లీక్ అవుతోందని, విద్యుత్ వైరింగ్ సరిగా లేదని, కుళాయిలు కూడా సరిగా పనిచేయడం లేదని విద్యార్థినులు తెలియజేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో సారథి, తహసీల్దారు లోకరాజు హామీ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.565

ముందస్తు జాగ్రత్తలతో కేన్సర్ నుంచి రక్షణ



డీఎంహెచ్‌వో నేతృత్వంలో ర్యాలీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి అన్నారు. కేన్సర్‌పై అవగాహన ర్యాలీని గురువారం తన కార్యాలయం వద్ద గీతాబాయి ప్రారంభించారు. ప్లకార్డులతో నిర్వహించిన ర్యాలీలో వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్

పెడన, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యుత్‌ను అందించి కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పెడన నియోజకవర్గం తోటమూలలో రూ.48.64 కోట్లతో నిర్మించిన 132 కేవీ విద్యుత్ స్విచ్చింగ్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. చంద్రబాబు మాట్లాడుతూ జిల్లాలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు.

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పెడనలో 132 కేవీ విద్యుత్ స్విచ్చింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడంతో నియోజక వర్గంలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో లో వోల్టేజీ సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు.

పెడనలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు



సబ్‌స్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ గతంలో పామర్రు-మచిలీపట్నం మధ్య ఎక్కువ దూరం నుంచి పవర్ ట్రాన్స్‌మిషన్ జగరడంతో పెడన వంటి ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యలు ఏర్పడేవన్నారు. పెడన నియోజకవర్గంలో నాలుగు వేల మంది రైతులు ఆక్వాసాగు చేస్తున్నారని, లోవోల్టేజీ ఇబ్బందులతో విద్యుత్ మోటార్లు కాలిపోయేవన్నారు. పెడనలో 132 కేవీ విద్యుత్ స్విచ్చింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. రానున్న రోజులలో మచిలీపట్నంపోర్టు, ఇతర పరిశ్రమలకు పెడనలోని విద్యుత్ స్విచ్చింగ్ కేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. గన్నవరంలో 11/32కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో మూడు మండలాల్లో 3.50 లక్షల మంది వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి ఒక ఫీడర్‌ను కేటాయించడంతో విమానాశ్రయంలో విద్యుత్ సమస్యలు ఏర్పడవని అన్నారు.

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ పెడనలో 32 కేవీ విద్యుత్ స్విచ్చింగ్ కేంద్రం ఏర్పాటుతో మచిలీపట్నం- విజయవాడ మధ్య రైల్వే లైనుకు విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఏపీ డీపీసీఎల్ ఎస్ఈ సత్యానందం, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ భాగ్యరాజ్, నడుపూరు సర్పంచ్ చీర్ల అనూష, తదితరులు పాల్గొన్నారు.



కృషి విజ్ఞాన కేంద్రం విద్యార్థులు, శాస్త్రవేత్తలతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

రైతు బాంధవుడు ఎన్జీ రంగా

ఘంటసాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతుల శ్రేయస్సు కోసం జీవితాన్నే అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య ఎన్జీ రంగా అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా 124వ జయంతిని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమంలో మహోన్నతమైన పాత్ర పోషించారన్నారు. పార్లమెంట్‌లో రైతాంగం కోసం గళమెత్తి పోరాడిన యోధుడు అన్నారు. ఎన్జీ రంగా స్ఫూర్తితో తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు ఆయన బాటలోనే పయనించారన్నారు. ఘంటసాల గ్రామానికి చెందిన కిసాన్ వెంకట సుబ్బయ్యకు ఎన్జీ రంగాతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఎన్జీ రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎన్జీ రంగా, కిసాన్ వెంకట సుబ్బయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి, వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియ లలిత, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, సర్పంచ్ బాణావత్ వెంకటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, టీడీపీ నేత బండి పరాత్పరరావు, తహసీల్దార్ బి.వి జయ ప్రసాద్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్ భక్తుల విరాళాలు

మోపిదేవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన బులుసు శంకరం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. గురువారం ఆయన స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణకు విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన దూళిపూడి శివ నాగమల్లేశ్వరరావు 24 గ్రాముల బంగారపు గొలుసును స్వామి వారికి సమర్పించారు. గురువారం కుటుంబసభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణకు రూ.1.90 లక్షల విలువ గల బంగారపు గొలుసను అందజేశారు.



భగవద్గీత పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర

భగవద్గీత పోటీల పోస్టర్ ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీతలో ఎన్నో జీవిత రహస్యాలు దాగివున్నా యని, బాల్యం నుంచి విద్యార్థులకు భగవద్గీత నేర్పాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహతి కళావేదికపై డిసెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించే సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాల పోటీల వాల్ పోస్టర్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ఆవిష్కరించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ప్రతినిధులు తురగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న గొల్లు కృష్ణ

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు విరమించాలి

మచిలీపట్నం టౌన్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రూఅప్ చార్జీలను విరమించాలని డీసీసీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు కాంగ్రెస్ నాయకులు గొల్లు కృష్ణ, అబ్దుల్ మతీన్, తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చి న మాటను నిలబెట్టుకుని విద్యుత్ ట్రూఅప్ చార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి మొవ్వ మోహనరావు, అబ్దుల్ మతీన్, కోకా ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చల్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు చల్లపల్లిలో ఎంపీడీవో అనగాని వెంకట రమణకు 104 డీఈవో బి.శ్యాంబాబు, డ్రైవర్ జి.నాంచారయ్య వినతిపత్రం అందించారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలనీ, డ్రైవర్, డీఈవోలకు ఉద్యోగభద్రత కల్పించాలని, బకాయి ఇంక్రిమెంట్‌లు అరియర్స్ రూపంలో ఇవ్వాలనీ, పీఎఫ్, ఈఎస్ఐను యాజమాన్యం వాటా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇప్పటి వరకూ అక్రమంగా వసూలు చేసిన యాజమాన్యం వాటా తిరిగి ఇప్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఘంటసాల విద్యార్థులు

ఘంటసాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఉమ్మడి కృష్ణాజిల్లా సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీరంగవల్లి తెలిపారు. అండర్-17 బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలకు దిరిశం అఖిల, గోలి మౌనిక, తుమ్మలచర్ల సాత్విక ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలికల బేస్‌బాల్ పోటీల్లో కంచర్ల పింకి, దిరిశం సాయి సిరి చందన, అండర్-14 బాలికలు బేస్‌బాల్ పోటీల్లో పరిశె హర్షిత, ఎన్.వెన్నెల, అండర్-17 బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆర్.నవీన్ కుమార్, అండర్-14 బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలకు టి.కృష్ణ తేజ ఎంపికయ్యారు. విద్యార్థులను, పీడీని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మండల సమావేశం నేడు

నాగాయలంక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.కె.సీతారామ్ కుమార్ తెలిపారు.

అవనిగడ్డ విద్యార్థుల ప్రతిభ

అవనిగడ్డ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మచిలీపట్నంలో నిర్వహించి వ్యాసరచన పోటీల్లో బి.నాగ సౌమ్య ప్రథమ స్థానం, జి.పున్నమి నాగజ్యోతి ద్వితీయ స్థానం, వక్తృత్వ పోటీలలో సిహెచ్.సాయికృష్ణ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు ఏసీబీ డైరెక్టర్ జనరల్ పక్షాన సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రేఖారాణి ఆధ్వర్యంలో కె.నాగరాజు, పి.సుబ్బారావు, జి.సాయికుమార్, అన్నపరెడ్డి శ్రీనివాసరావు, ఎస్.దిలీప్, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

బాలల హక్కులపై అవగాహన

అవనిగడ్డ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వేకనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రాహుల్ ప్రభాకర్ తెలిపారు. అవనిగడ్డ ఐసీడీఎస్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలల హక్కులపై గురువారం అవగాహన కలిగించారు. ప్రేమలత, శ్యామల, సూరిబాబు, శిరీష, రత్నమాల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంపీహెచ్‌వో, హెల్త్ సూపర్‌వైజర్‌తోపాటు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.రవీంద్రబాబు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

నాగాయలంక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కేన్సర్‌పై అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగాయలంక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాగాయలంక సెంటర్ వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు వి. శివరామకృష్ణ, ఇంద్రకిరణ్ రెడ్డి, పీహెచ్‌వో శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతాప్రమాణాలతో రహదారి నిర్మాణం పూర్తి చేయాలి

మోపిదేవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ రహదారుల నిర్మాణ పనులను నాణ్యతాప్రమాణాలతో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈఈ వి.సురేష్‌బాబు తెలిపారు. కోసూరువారిపాలెంలో రూ.22.50 లక్షల వ్యయంతో 286 మీటర్ల పొడవున చేపట్టిన రహదారి నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు లోపించినట్లైతే శాఖాపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు రికవరీ చేయాల్సి వస్తుందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరిధర్, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు భోగిరెడ్డి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ

మచిలీపట్నం టౌన్ , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నాపురం గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో బంటుమిల్లి, మచిలీపట్నం, మొవ్వ, కృత్తివెన్ను, గూడూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు. అడిషనల్ డీపీఎం నాగమల్లేశ్వరి రైతులకు బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, నిమ్మకాయ ద్రావణం, ఆర్గానిక్ పొటాష్ తయారీలపై శిక్షణ ఇచ్చారు. గంగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.25 వేల ఆర్థిక సహాయం

కోడూరు, నవంరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉల్లిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న కంచర్లపల్లి నరసింహారావు కుటుంబసభ్యులకు దాతల సహకారంతో రూ.25 వేల ఆర్థిక సాయ మందించారు. మండల టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో నరసింహారావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. కూటమి నాయకులు బండే శ్రీనివాసరావు, కడవకొల్లు శ్రీనివాసరావు, కంచర్లపల్లి జగన్మోహనరావు, ముద్దినేని చంద్రరావు, కంచర్లపల్లి వెంకట నాంచారయ్య, దావు మల్లి తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ములకు తీవ్రగాయాలు

చల్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా మండలం వెలివోలు వద్ద కరకట్టపై రోడ్డు ప్రమాదం జరిగింది. లక్ష్మీపురం శివారు రామానగరానికి చెందిన కార్ డ్రైవింగ్ శిక్షకుడు మేకా భాస్కర్ కుమారులు భానుప్రకాష్, శశిధర్ ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళుతూ వెలివోలులో స్పీడ్ బ్రేకర్ దాటిన తర్వాత ప్రమాదానికి గురయ్యారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిందా, అదుపుతప్పి పడిపోయారా అనేది తెలియరాలేదు. స్థానికులు మురాల నాగేశ్వరరావు, బొల్లా రవి వారిద్దరినీ చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ రిఫర్ చేశారు.



యోగా సాధకులకు కలెక్టర్ అభినందన

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన యోగ సాధకులు జాతీయ స్థాయి పోటీలకు వెళ్లి కృష్ణాజిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్రమండలి హాలులో జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈనెల 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన యోగా సాధకులు కె.స్వర్ణలత, సునంద, వి.వి.మధుసూదనరావు, వై.శ్రీనివాసరావు, ఎస్.రమేష్, ఏడుకొండలు, కె.రామారావులను అభినందించారు. కలెక్టర్ సతీమణి పృథ్వి, యోగా గురువులు గురునాథబాబు, విద్యుత్‌శాఖ నోడల్ అధికారి భాస్కరరావు, ఎం.వెంకటేశ్వర ప్రసాద్, ఆర్డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుమంత్ కోసం కృష్ణానదిలో గాలింపు చర్యలు

చల్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొడ్డు సుమంత్ కోసం కృష్ణానదిలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పులిగడ్డ-పెనుమూడి వారధి వద్ద బైక్ కన్పించిన నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్న పోలీసులు నదిలో గాలింపు చేపట్టారు. డీఎస్పీ మురళీధర్, సీఐ ఈశ్వరరావు పర్యవేక్షణలో చల్లపల్లి ఎస్సై పి.సుబ్రహ్మణ్యం పడవలో వెళ్లి నదిలో గాలింపు చర్యలు సాగించారు. గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినప్పటికీ గురువారం సాయంత్రం వరకూ ఆచూకీ లభించలేదు. రోజు గడిచినా ఆచూకీ తెలియక కుటుంబ సభ్యుల్లో ఆందోళన మరింతగా పెరిగింది.



